PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 36 | విజయవాడ, శనివారం 6 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Saturday 6 September 2025 Rs

'యూరియా' కష్టాలు

- క్యూ లైన్లలో రైతులు
- పోలీసు బందోబస్తు

3



భారత్ శుభారంభం

- థాయ్‌లాండ్‌పై 11-0తో గెలుపు
- ఆసియాకప్ మహిళల హాకీ

8

పత్తి కొనుగోళ్ల నుంచి వైదొలగనున్న సిసిఐ!

• డిబిటి ప్రవేశపెట్టే యోచన • ఎంఎస్‌పికి మంగళం

- మోడీ ప్రభుత్వం కసరత్తు
- రైతులకు మరింతగా ధరలు పతనమయ్యే ప్రమాదం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు కోసం ఇప్పటి వరకు భారత పత్తి సంస్థ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- సిసిఐ) రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తుండగా, ఇకపై ఆ కార్యక్రమం నుంచి ఆ సంస్థను పూర్తిగా తప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పత్తి కొనుగోళ్లలో నగదు బదిలీ పథకం (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్-డిబిటి)ని ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. మోడీ ప్రభుత్వం బడ్జెట్ సమయంలోనే ఈ ఆలోచన చేసినప్పటికీ ప్రకటించలేదని, అతి త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఈ విషయంపై పత్తి సాగు అధికంగా ఉన్న రాష్ట్రాలతో కేంద్రం నుంచి సంప్రదింపులు సాగుతున్నాయని సమాచారం. పత్తి ధరలు పతనమైన సందర్భాల్లో సిసిఐ మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తే వ్యాపారులు దారికొస్తారు. ఈ విధానం కొన్నేళ్లుగా అనుభవంలో ఉంది. అదే సిసిఐ ఆ పని చేయకపోతే వ్యాపారులు, దళారుల దోపిడీకి మరింతగా రైతులు గురి కావలసి వస్తుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకాలు రద్దు చేయడంతో దేశీయ రైతులకు ధర తగ్గుతుందన్న ఆందోళనలు ఉన్నాయి. ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సి2+50 శాతం ఎంఎస్‌పి ప్రకటించి అమలు చేయాలని రైతులు ఉద్యమిస్తుండగా, మొత్తానికే పత్తి కొనుగోళ్ల నుంచి సిసిఐని నిష్క్రమింపచేసేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుంది.

35 శాతం కొనుగోళ్లు ఆ సంస్థవే

పత్తి సాగు, ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రపంచంలోనే భారతదేశం ప్రముఖ స్థానంలో ఉంది. దేశంలో ఏటా కొంచెం అటు ఇటుగా 3 కోట్ల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా, 3 కోట్ల బేళ్ల పత్తి దిగుబడులు లభిస్తున్నాయి. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటించే పంటల్లో పత్తి కూడా ఒకటి. మార్కెట్‌లో ధరలు పతనమైనప్పుడు సిసిఐ రంగంలోకి దిగి రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. దీనివల్ల వ్యాపారులు రైతులకు ధర పెంచడం చూస్తున్నదే. దేశంలో ఉత్పత్తి అవుతున్న పత్తిలో 25-35 శాతం సిసిఐ కొనుగోలు చేస్తోంది. మాంచి సీజన్‌లో ప్రతి రోజూ మార్కెట్‌కు వచ్చే పత్తిలో 50- 70 శాతం కొంటోంది. ఈ విధంగా కొన్న పత్తిని దేశీయంగా ప్రైవేటు పరిశ్రమలకు అమ్ముతుంది. విదేశాలకు ఎగుమతి చేస్తుంది. రైతుల నుంచి పత్తిని కొని నిల్వ చేయడానికి, ఇతర నిర్వహణలకు సిసిఐకి భారీగా ఖర్చవుతోందని, నిల్వలు పేరుకుపోతున్నాయని, సంస్థకు నష్టాలొస్తున్నాయన్న సాకుతో ఇకపై రైతుల నుంచి సిసిఐని పత్తి కొనుగోళ్ల నుంచి తప్పించాలని మోడీ సర్కారు ప్రయత్నిస్తోంది. టెక్స్‌టైల్ మినిస్ట్రీ బడ్జెట్‌లో మూడేళ్ల నుంచి కొనుగోళ్లకు నిధులు కేటాయించడం మానేసింది. 2022-23లో రూ. 0.01 కోట్లు చూపించింది. 2023-24లో రూ.600 కోట్లు ప్రతిపాదించి రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నిరుడు, ఈ ఏడు బడ్జెట్‌లలో రూ.0.01 కోట్లు చూపించింది.

నగదు బదిలీ అంటే...

ఇప్పటి వరకు డిబిటి అనేది ఎంఎస్‌పి ప్రకటించని పంటలకు మాత్రమే మిగతా 7లో

అమెరికాలో తగ్గిపోయిన ఉద్యోగాల వృద్ధి...

- 4.3% చేరుకున్న నిరుద్యోగిత రేటు
- బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ వెల్లడి

వాషింగ్టన్ డిసి : అమెరికాలో ఉద్యోగాల వృద్ధి తగ్గిపోయింది. శుక్రవారం అమెరికన్ లేబర్ స్టాటిస్టిక్స్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం ఆగస్టులో నిరుద్యోగ రేటు 4.3% పెరిగింది. జులై నెలలో 73 వేల ఉద్యోగాలు నమోదుకాగా, ఆగస్టులో కేవలం 22 వేల కొత్త ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. ఆర్థిక నిపుణులు 80 వేల ఉద్యోగాలను అంచనా వేసినా, గణనీయంగా తగ్గాయి. గత సంవత్సర ఆగస్టులో 82 వేల ఉద్యోగాలను కల్పించారు. గత మూడు నెలల కాలంలో సగటున 29 వేల ఉద్యోగాలు మాత్రమే నమోదయ్యాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో అమెరికన్ కార్మిక మార్కెట్ వేగంగా దిగజారుతుంది. జులైలో వచ్చిన ఉద్యోగాలు అత్యధిక శాతం ఆరోగ్య, సామాజిక, సేవా రంగాల్లోనివే. మే, జూన్ నెలల్లో సైతం అంచనాలకు అనుగుణంగా ఉద్యోగాల కల్పన నమోదుకాలేదు. ఈ నివేదిక నేపథ్యంలో వడ్డీ రేట్లు తగ్గుతాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గించాలని ట్రంప్ ఒత్తిడి చేసినా సెంట్రల్ బ్యాంక్ పెంచలేదు. జులై నెలకి సంబంధించిన నిరుద్యోగ వివరాలను ప్రకటించినందుకు అప్పటి బిఎల్‌ఎస్ అధిపతి మెక్ ఎంటార్ఫర్‌ను ట్రంప్ తొలగించిన సంగతి తెలిసిందే. అయితే పెరిగిన వడ్డీ రేట్లు, దిగుమతి సుంకాలు, వలసలపై కఠిన చర్యల కారణంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి కూరుకుపోవడాన్ని సూచిస్తుందని, ట్రంప్ టారిఫ్ విధానాలు వల్ల కంపెనీలు నియామకాలు తగ్గించటంతో పాటు, లే ఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని, ఆర్థిక అనిశ్చితి పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ గురువారం ప్రముఖ కంపెనీల సిఇఒలతో సమావేశమైన అనంతరం బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బిఎల్‌ఎస్) ఈ రిపోర్ట్‌ను వెల్లడించడం గమనార్హం..



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ తదితరులు

విద్యార్థుల బాధ్యత గురువులదే

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలను తీరుస్తాం
- ఉపాధ్యాయ దినోత్సవంలో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉపాధ్యాయుల బాగోగులు చూసుకునే బాధ్యత తనదే అని చెప్పారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తల్లిదండ్రుల తరువాత గౌరవించే స్థానం ఉపాధ్యాయులదేనని చెప్పారు. ప్రతి ఒక్కరిలోనూ నైపుణ్యం ఉంటుందని, దానిని బయటకు తీసే వ్యక్తి గురువులేనని చెప్పారు. పిల్లలకు ఆస్తుల కంటే చదువును ఇస్తేనే వారు ఊహించనంత ఎత్తుకు ఎదుగుతారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను తొలిసారి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో చుక్కా రామయ్య వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు సాధించేవారని తెలిపారు. 10వేల మందికి పరీక్ష నిర్వహించి, కేవలం వందమందినే ఎంపిక చేసుకునేవారని వివరించారు. రామయ్య వద్ద సీటు ఇప్పించాలని తన వద్దకు చాలామంది వచ్చారని, తాను కోరినా ఆయన ఇచ్చేవారు కాదని అన్నారు. ఆ తరువాత ఐఐటి అడ్మిషన్లపై దృష్టి సారించామని, ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన విద్యార్థులే 20శాతం మంది సీట్లు పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు తాను నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నానని, ఈ ప్రయత్నాలకు ఉపాధ్యాయుల సహకారం అవసరమని చెప్పారు. విద్యాశాఖను ఏమాత్రం నిర్లక్ష్యం చేయనని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ వంటి పేర్లతో రాజకీయాలకు అతీతంగా వ్యవస్థను తీర్చిదిద్దడం శుభపరిణామని తెలిపారు. టీచర్లు ఐటి నాలెడ్జ్ కూడా పెంచుకొని టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న అంశాలను రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

ఈ నెలలోనే కొత్త టీచర్లు:లోకేష్

మెగా డిఎస్‌సి ద్వారా 16,347 మంది ఉపాధ్యాయులు ఈ నెలలోనే పాఠశాలల్లో బోధనకు వస్తారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. 13 డిఎస్‌సిల ద్వారా 1.80 లక్షల మంది ఉపాధ్యాయులను చంద్రబాబు హయాంలో నియమించారని తెలిపారు. గడిచిన ఏడాదిలో అందరితో చర్చించి విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఈ సంస్కరణలు పూర్తయ్యాయని, రానున్న నాలుగేళ్లల్లో ఇక ఉండవని అన్నారు. దేశంలో ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఎపి గురించి మాట్లాడాలని, అందరం కలిసికట్టుగా ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ (లీప్) మోడల్‌ను పకడ్బందీగా అమలుచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 9,600 ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేశామని తెలిపారు. అంతకుముందు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు చంద్రబాబు నాయుడు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు, కొలికపూడి శ్రీనివాస్, విద్య, మౌలిక సదుపాయాల చైర్మన్ రాజశేఖర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్, రష్యాలను చైనాకు కోల్పోయాం !

- ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : తియాన్‌జిన్‌లో ఇటీవల జరిగిన షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఒ) తర్వాత భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లుగా కనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వ్యాఖ్యానించారు. 'అంధకార చైనాకు భారత్, రష్యాలను కోల్పోయినట్లుగా కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు కలిపి మంచి భవిష్యత్తు వుండవచ్చు' అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక అయిన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దీంతో పాటు ప్రధాని మోడీ, రష్యా, చైనా నేతలు పుతిన్, జిన్‌పింగ్ కలిసి వున్న పాత ఫోటోను కూడా జత పరిచారు. రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించి 80ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని చైనాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పుతిన్, ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌లతో కలిసి జిన్‌పింగ్ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఇదివరకే ట్రంప్ నోరుపారేసుకున్న సంగతి తెలిసిందే.



ప్రధాని మోడీతో సమావేశమైన రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

పెట్టుబడుల రాకకు కేంద్రం మద్దతు

- నిరంతర సహకారం..మార్గదర్శనం అవసరం
- ప్రధాని మోడీకి రాష్ట్ర మంత్రి లోకేష్ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు, పరిశ్రమలు నెలకొల్పేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం నాడు ప్రధానితో ఆయన భేటీ అయ్యారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ అందజేశారు. రాష్ట్రానికి సెమీ మిగతా 7లో

తురకపాలెం మరణాలపై వీడని మిస్టరీ

- అంతుచిక్కని వ్యాధి
- కొనసాగుతున్న పరీక్షలు
- నేడు బ్లడ్ కల్చర్ పరీక్ష రిపోర్టు : డిఎంఅండ్ హెచ్ఒ

15 నుంచి యుటిఎఫ్ రణభేరి

- ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త జాతా

2

ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్యం

• పి3 పేరుతో ప్రయివేటుపరం ఆపాలి • సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వైద్య విద్య మీద, ఆరోగ్యశ్రీ మీద తీసుకున్న నిర్ణయం ప్రజారోగ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోగ్య రంగంతో పాటు, వైద్య విద్యలను ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆరంభించిన 10 మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణమని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయని, ప్రయివేటు యాజమాన్యం సంపన్నులకే సీట్లు ఇస్తాయని విమర్శించారు. వ్యాపారదక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందడం తగ్గిపోతుందని పేర్కొన్నారు, వైద్యం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైందన్న విషయం ప్రపంచంలో అనేక దేశాల్లో నిరూపణైందని తెలిపారు. ప్రైవేట్ ఆజమాయిషిలో ఫీజులు, అడ్మిషన్లు వాటిలో డొల్లతనం అనేక సందర్భాల్లో బయటపడిందని వివరించారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారని, సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఒ 107, 108ని రద్దు చేయాలని కోరారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ప్రభుత్వమే వైద్యకళాశాలల్ని నడపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం కొన్ని పెద్ద జబ్బులకు కొంత ఊరట కలిగించినప్పటికీ పూర్తి పరిష్కారం కాదని వివరించారు. ఈ కొద్ది సాయం చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి చేతులు దులుపు కోవాలనుకోవడం దుర్మార్గమని, ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేయడమే తప్ప మరొకటి కాదని విమర్శించారు. ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ మిగతా 7లో



మావోయిస్టుల మృతదేహాలు, మోహరించిన భద్రతా బలగాలు

దండకారణ్యంలో మళ్లీ నెత్తుటి ధార

- బస్తర్‌లో ఎదురుకాల్పులు
- ఆరుగురు మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ : దండకారణ్యంలో మళ్లీ నెత్తుటి ధార పారింది. బస్తర్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య శుక్రవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో మొదలైన కాల్పులు ..సాయంత్రం వరకు కొనసాగాయి. ఈ ఘటనలో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షాల కారణంగా కొంత విరామం ఇచ్చిన తర్వాత బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులను లక్ష్యంగా చేసుకొని భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. నారాయణ్‌పూర్, దంతెవాడల మధ్య శుక్రవారం ఉదయం నుండి కాల్పుల మోత సాగుతోంది. అబుజమద్ ఏరియాలోని అడవుల్లో కీలకమైన సమావేశం కోసం మావోయిస్టులు పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లు తమకు సమాచారం అందిందని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. ఈ సమాచారం అందిన వెంటనే డ్రాగన్ రైజింగ్ గ్రూప్ (డిఆర్‌జి) సైనికులను అక్కడకు పంపారు. ఉదయం 9గంటల ప్రాంతంలో సైనికులు, మావోయిస్టుల మధ్య కాల్పులు ఆరంభమయ్యాయి. దీనిపై ఎస్‌పి గౌరవ్ రాయ్ మాట్లాడుతూ, పోలీసులు వస్తున్న విషయం తెలియగానే నక్సలైట్లు అడవిలోకి వెళ్లిపోయారని..ఆ తర్వాత ఇరు పక్షాల నుండి కాల్పులు మొదలయ్యాయని చెప్పారు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయన్నారు.

మరో భూ సేకరణ!

- కృష్ణపట్నం నుండి హైదరాబాద్‌కు పైప్‌లైను
- బిపిసిఎల్ కోసం సర్కారు కసరత్తు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీ కోసం చేపట్టిన భూ సేకరణను రైతులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదు. ఆ ప్రతిఘటన కొనసాగుతుండగానే తాజాగా మరో భూసేకరణకు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇంధన సరఫరా లక్ష్యంగా బిపిసిఎల్ బిపిసిఎల్ పైప్‌లైన్ కోసం చేపట్టిన ఈ భూ సేకరణ ప్రక్రియ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం నుండి ప్రారంభమై కరేడు సమీపం నుండి ప్రకాశం, గుంటూరు జిల్లాల మీదుగా హైదరాబాద్ వరకు సాగనుంది.424 కిలోమీటర్ల మేర సాగనున్న ఈ పైపు నిర్మాణంకోసం 1932 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కరేడులో సాగుతున్న పోరాటానికి ఒక పరిష్కారం చూపకుండానే మరో భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించడానికి సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. పైగా ఇది తక్షణ అవసరాలకోసం కాకపోయినా, భవిష్యత్ అవసరాలకోసం అంటూ హడావిడిగా ఈ ప్రక్రియను చేపట్టడం కూడా ఆసక్తి కరంగా మారింది. పైప్‌లైన్‌కోసం సేకరణ చేయాల్సిన భూములను కూడా ఇప్పటికే గుర్తించారు. వీటిలో అత్యధికభాగం వ్యవసాయ భూములే! గుంటూరు జిల్లాలో నాగార్జున సాగర్ ఆయుకట్ట భూములు కూడా ఉన్నట్లు సమాచారం. అయినా కూడా భవిష్యత్ అవసరాల పేరిట చకచకా సాగుతున్న ఈ ప్రక్రియలో కార్పొరేట్ల, కాంట్రాక్టర్ల ప్రయోజనాలు ఉన్నాయని, అదే సమయంలో రాజకీయ నేతల, అధికారుల చేతివాటం కూడా ఉంటుందన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. బిపిసిఎల్ మొదట తన ఆయిల్‌శుద్ధి కార్మాగారాన్ని విశాఖపట్నంలోఏర్పాటు చేయాలని భావించింది. అదాని గ్రూపు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టును స్వాధీనం చేసుకున్న తరువాత బిపిసిఎల్ కూడా అటువైపు దృష్టిసారించింది. పెట్రోలియం ఉత్పత్తులను కృష్ణపట్నంపోర్టు నుంచి హైదరాబాదుకు తరలించాలని నిర్ణయించింది.దీనికోసం చేపట్టే పైపు లైను ద్వారా ఒంగోలు, గుంటూరు, విజయవాడలోని తన డిపోలకు, అనుబంధ సంస్థగాఉన్న తెలంగాణలోని హెచ్‌పిసిఎల్ ఇంధన అవసరాలను ఆ సంస్థ తీర్చనుంది. తద్వారా కృష్ణపట్నం పోర్టులో వ్యాపారకార్యకపాలాలు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, దీనివల్ల అదాని గ్రూపునకే ఎక్కువ ప్రయోజనాలు చేకూరుతాయన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బిపిసిఎల్ కూడా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించే జాబితాలో ఉండటంతో ఈ భారీ పైప్‌లైన్ నిర్మాణం భవిష్యత్‌లో కార్పొరేట్లకే లబ్ది చేకూర్చుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు బిపిసిఎల్ రామాయపట్నంలోనూ చమురు శుద్ధికర్మాగారాన్ని నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం కూడా అవసరమైన వేలాది ఎకరాలు కేటాయించింది.మౌళిక సదుపాయాలు కూడా కల్పించింది. ఈ నేపథ్యంలో రామాయపట్నం నుండే ఇంధనం తరలింపునకు అవకాశం ఉన్నప్పటికీ కృష్ణపట్నం నుండి ఆ ప్రక్రియను చేపట్టడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



3 వేల విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 3,005 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్ ఆరోగ్య మందిర్స్) నిర్మాణానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.217.10 కోట్లు నేషనల్ హెల్త్ మిషన్ నుంచి కేటాయించనున్నారు. ఉపాధి హామీ పథకంలో 2,309 భవనాలు, ప్రధానమంత్రి ఆయుష్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పిఎంఎబిహెచ్ఐఎం) పథకంలో మరో 696 భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.55 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఈ మొత్తంలో భవన నిర్మాణానికి రూ.42 లక్షలు, ప్రహరీకి మరో రూ.13 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా పంచాయతీరాజ్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

18 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈనెల 18నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అదేరోజు ఉదయం 9 గంటలకు శాసనసభ ప్రారంభం కానుండగా, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు

- ఎపి రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా కొత్తవలస గ్రామంలో రజకులపై దాడి చేసిన పెత్తందార్లపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామానికి చెందిన హరమ్మపై, ఆమె ముగ్గురు కుటుంబ సభ్యులపై వినాయక చవితి ఉత్సవాల సమయంలో పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని పెత్తందార్లు మారణాయుధాలతో దాడికి పాల్పడినట్లు చెప్పారు. హరమ్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మరణించిందని, ముగ్గురు కుటుంబ సభ్యులు తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వృత్తిదారుల రక్షణకు సామాజిక రక్షణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బర్డ్ ఫ్లూ వల్ల కోళ్లు చనిపోలేదు

- పశు సంవర్థక శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా కొత్తవలస మండలంలో కోళ్లు చనిపోవడానికి బర్డ్ ఫ్లూ కారణం కాదని విజయవాడలోని విబిఆర్ఐ సంస్థ ధ్రువీకరించిందని పశు సంవర్థక శాఖ డైరెక్టర్ టి.దామోదర్ నాయుడు తెలిపారు. విజయవాడలోని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోళ్ల మరణాలకు ఇన్ క్లూజన్ బాడీ హెపటైటీస్ (ఐబిహెచ్), కొక్కెర వ్యాధి (ఆర్‌డి) కారణమని నిర్ధారించారని చెప్పారు. ఈ నెల 4న పౌల్ట్రీ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించి బర్డ్ ఫ్లూపై ప్రస్తుత పరిస్థితిని వివరించడం జరిగిందని, అన్ని కోళ్ల ఫారాల్లో జీవ భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరినట్లు తెలిపారు. అన్ని జిల్లాల పశుసంవర్థక శాఖ అధికారులకు బర్డ్ ఫ్లూ వ్యాధిపై తగు సూచనలిచ్చామని, ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే ప్రధాన కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కోళ్లకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలను రైతులకు ముందుగా అందజేస్తున్నామన్నారు. పట్టణాల్లో వీధి కుక్కల నియంత్రణకు 4 ఎన్‌జిఒలతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. యాంటీ రేబిస్ టీకాలు రాష్ట్రంలోని అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు 25 లక్షల కుటుంబాలకు పశు సంవర్థక రంగం జీవనోపాధి కల్పిస్తోందన్నారు. రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తిలో 12.17 శాతం వాటాతో రూ.1.61 లక్షల కోట్లు పశుగణ రంగం నుంచి లభిస్తోందన్నారు. పశువుల దాణాపై రైతులకు రాయితీ అందజేస్తామన్నారు.

బంగారం వ్యాపారి హత్య

ప్రజాశక్తి - నరసన్నపేట


పార్వతీశ్వర గుప్తా (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని లచ్చుమన్నపేట వీధికి చెందిన పార్వతీశ్వర గుప్తా బంగారు బిస్కెట్లను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి శ్రీకాకుళం, నరసన్నపేటలోకి పలు బంగారు దుకాణాలకు సరఫరా చేసేవారు. గత నెల 26న విశాఖపట్నం వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో, కుటుంబసభ్యులు 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుని కారు డ్రైవర్ సంతోష్, ఆయన స్నేహితుడు రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. పార్వతీశ్వర గుప్తా విశాఖ నుంచి తిరిగి వస్తుండగా హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు విచారణలో తెలడంతో, రెండు రోజులుగా శ్రీకాకుళం సమీపంలోని ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. రామలక్ష్మణ కూడలి సమీపంలో రామిగడ్డ వద్ద మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. బంగారం కోసమే పార్వతీశ్వర గుప్తాను నిందితులు హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతో సత్వర న్యాయం

- మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలతో వివాదాలకు పరిష్కారం
- విశాఖలో ఎడిఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం
- ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వేదికపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పిఎస్.నరసింహ, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఈజ్ ఆఫ్ జస్టిస్' వ్యవస్థతో సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని వివరించారు. శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ (ప్రత్యామ్నాయ వివాదం) రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావడంతోపాటు వేగంగా, సమర్థవంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం మనదేశానికి కొత్తకాదని, తరాలుగా అందుబాటులో ఉందని తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్థవంతమైన మీడియేటర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్థవంతంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభం వంటిదన్నారు. రాజ్యాంగపరమైన హక్కులను, చట్టాలను కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. నిబద్ధతకు, నిష్పాక్షికతకు, పారదర్శకతకు పెట్టింది పేర్కొన్నారు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతి పౌరునికీ ఉందని తెలిపారు. విశాఖలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఎడిఆర్) ఎకో సిస్టం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్‌కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ చాలామంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లడం అవమానంగా భావిస్తున్నారని, దీనికి మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని వివరించారు. మన దేశం అమలు చేస్తోన్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తోన్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవడమే ఆర్థిక వ్యవస్థకు కీలకమన్నారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఇ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందన్నారు.

దేశంలో సంస్కరణలు వేగవంతం

మనదేశం అత్యంత వేగంగా సంస్కరణలను అమలు చేస్తోందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని, ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయవ్యవస్థలు అందుబాటులోకి రావాలని, ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలని, టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని అన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం నమ్మకాన్ని కలిగిస్తుందని తెలిపారు. వివాదాల పరిష్కారంలో పౌరులకు, కోర్టులకు మధ్య ఉన్న అగాధాన్ని పూరిస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మరో న్యాయమూర్తి పిఎస్.నరసింహ మాట్లాడుతూ ఎపి వంటి రాష్ట్రాలకు మధ్యవర్తిత్వం ఒక వరం వంటిదన్నారు. ఈ రాష్ట్రంలో కేసుల ఒత్తిడి ఉందని తెలిపారు. కోర్టులపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి మధ్యవర్తిత్వం అవసరమన్నారు. ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎపిలో 650 మంది జడ్జిలు ఉన్నారని, కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో 800 మంది అవసరమని తెలిపారు. మధ్యవర్తిత్వ నిపుణులను తయారు చేసేందుకు 40 గంటల శిక్షణ అవసరమని, వారికి చాలా నైపుణ్యం ఉండాలని అన్నారు. ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అధికారులతో సిఎం సమీక్ష

రైల్వే ప్రాజెక్టుల ప్రగతిపై విశాఖలో రైల్వే ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాధుర్ సహా పలువురు అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



సభలో మాట్లాడుతున్న రాంభూపాల్, పక్కన సిపిఎం నేతలు

సోషలిజంతోనే సంపూర్ణ స్వాతంత్ర్యం

- రాజ్యాంగం, లౌకికతత్వ పరిరక్షణ ఎర్రజెండా లక్ష్యం
- సీతారాం ఏచూరి వర్ధంతి సభలో రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో దోపిడీ, వివక్ష, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థ రూపుమాపాలన్నా, ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ అందించేలన్నా సోషలిజమే శరణ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. దేశంలో సోషలిజం వచ్చినప్పుడే ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్లు అని అన్నారు. సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నగరంలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. తొలుత లలిత కళాపరిషత్ నుంచి ఏచూరి చిత్రపటం చేతపట్టుకుని ఎర్రజెండాలతో భారీ ర్యాలీ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు వి.రాంభూపాల్, అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ముఖ్య అతిథులుగా హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. దేశంలో మతతత్వం, కార్పొరేట్, ప్రయివేటీకరణ, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు ఎర్రజెండాను ఆయుధంగా చేసుకుని సీతారాం ఏచూరి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తుది శ్వాస విడిచే వరకు ప్రజల పక్షాన గొంతెత్తి పోరాడిన గొప్ప నేత అని కొనియాడారు. కేంద్రం అమలు చేస్తోన్న కార్పొరేట్, ప్రయివేటీకరణ, మతతత్వ విధానాలతో రాజ్యాంగం, లౌకికతత్వానికి ఆటంకం కలుగుతోందన్నారు. ఎన్నికల కమిషన్ భ్రష్టు పట్టిందని విమర్శించారు. అధికార, ప్రతిపక్షాలు రెండు మోడీకి మోకరిల్లుతుండటం రాష్ట్ర ప్రజల దౌర్భగ్యమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరిస్తున్న మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాజ్యాంగం, లౌకికతత్వ పరిరక్షణే ఎర్రజెండా లక్ష్యమన్నారు. నల్లప్ప మాట్లాడుతూ.. ఈ నెల 12 వరకూ గ్రామ, పట్టణాల్లో ఏచూరి వర్థంతి వేడుకలు నిర్వహిస్తామని, హిందూత్వ, మతతత్వ విధానాలను ఎండగడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీపై దృష్టి సారించండి

- కలెక్టర్లకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యూరియా పంపిణీపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అధికారిక లెక్కలు, గ్రౌండ్ లెవల్ నిల్వల్లో తేడా లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం కృష్ణ, ఎన్‌టిఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణ, బాపట్ల, కడప జిల్లాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కలెక్టర్లు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు. రబీ సీజన్ కోసం 9.5లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని,ఈ నేపథ్యంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గంగవరం,కాకినాడ పోర్టుల నుంచి రాష్ట్రానికి రావాల్సిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సమయానికి చేరుకునేలా రాష్ట్ర అధికారులు, పోర్టు అధికారులు, రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. యూరియా సరఫరాలపై డయల్ యువర్ కలెక్టర్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాను మంత్రి అభినందించారు. మరో 10 రోజులు కలెక్టర్లు యూరియా పంపిణీ జరిగే విధంగా చూడాలన్నారు.

తురకపాలెం మరణాలపై వీడని మిస్టరీ

- అంతుచిక్కని వ్యాధి
- కొనసాగుతున్న పరీక్షలు
- నేడు బ్లడ్ కల్చర్ పరీక్ష రిపోర్టు : డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో సంభవించిన అసాధారణ మరణాలపై నెలకొన్న మిస్టరీ వీడలేదు. మృతుల బంధువులు, గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి సేకరించిన రక్తనమూనాలను చెన్నై పంపామని, నివేదికలు వచ్చిన తర్వాత వ్యాధి నిర్ధారణ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా వైద్యపరీక్షల్లో వారికి మెలైడియోసిస్ అనే వైరస్ ఉందని నిర్ధారించారు. దీంతో, ఈ వైరస్ వల్ల వచ్చిన వ్యాధి వల్లే ఎక్కువమంది చనిపోయినట్టు చెబుతున్నారు. అసాధారణ మరణాలుంటే... అంటే ఒకే నెలలో ఒకే ప్రాంతంలో వెయ్యి మందిలో ఇద్దరి కన్నా ఎక్కువమంది చనిపోతే వెంటనే అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఏప్రిల్‌లో ఇద్దరు, మేలో ముగ్గురు, జూన్ ఇద్దరు, జులైలో పది మంది, ఆగస్టులో పది మంది, సెప్టెంబర్‌లో ఇప్పటి వరకూ ఇద్దరు మృతి చెందారు. మొత్తం 29 మంది మరణించినట్టు అధికారులు చెబుతుండగా, గత రెండు నెలల్లో వేర్వేరు కారణాలతో మరో 16 మంది చనిపోయినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 29 మందిలో ఐదుగురు డయాబెటిక్, ముగ్గురు బిపి, ఆరుగురు హైపర్ టెన్షన్‌తోపాటు డయాబెటిక్, ఒకరు హెచ్ఐవి, ఒకరు కేన్సర్, 12 మంది స్ట్రోక్, ఒకరు రోడ్డు ప్రమాదం కారణాలతో మృతి చెందారని అధికారులు అంటున్నారు. తొమ్మిది మంది ప్రభుత్వాస్పత్రిలోనూ, 13 మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ, ఏడుగురు ఇంటి వద్ద మరణించారు. ఎక్కువమందికి జ్వరం, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, మరికొందరికి కీళ్ల నొప్పులు, దగ్గు, తలనొప్పి ఉన్నట్టు చెప్తున్నారు. మృతుల్లో ఐదుగురు స్టోన్ క్రషర్, జూట్ మిల్లు కార్మికులు, నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు షాపు, పాల వ్యాపారం చేసే అత్యంత పేదలు ఉన్నారు. గ్రామంలో 870 గృహాలు ఉండగా 2,400 మంది జనాభా ఉంది. ఒకే గ్రామంలో రెండు నెలల వ్యవధిలో 22 మంది మృతి చెందడం వల్ల అధికారులు బ్లడ్ కల్చర్ పరీక్షలు చేశారు. వాటర్ శాంపిల్స్ టెస్టింగ్, కెమికల్ ఎనాలసిస్ రిపోర్ట్ సాధారణంగానే ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చేరువలో ఉన్న క్వారీ నుంచి వచ్చే కాలుష్యంతో ప్రజలకు శ్వాస కోశ వ్యాధులు వస్తున్నా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మూడు బెల్టు షాపులు ఉన్నాయని, ఉదయం పరగడుపున కొంతమంది మద్యం సేవిస్తున్నారని మహిళలు తెలిపారు. వీటిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని, గత మూడు రోజులుగా అధికారులు, మీడియా ప్రతినిధులు ఎక్కువగా రావడంతో రెండు రోజులుగా బెల్ట్ షాపులను మూసివేశారని మహిళలు తెలిపారు. ప్రధానంగా మెలైడియోసిస్ అనే వైరస్ ఎంతమందికి వ్యాపించింది. మరణాల్లో ఎక్కువ మందికి ఈ వైరస్సే కారణమనా? అనే దానిపై అధికారులు ఇంకా స్పష్టమైన నిర్ధారణకు రాలేదు. శుక్రవారం సాయంత్రం వరకు గ్రామంలో రక్తనమూనాలు సేకరించిన 59 మందికి సంబంధించిన నివేదికలు వచ్చాయని, ఇవన్నీ సాధారణంగా ఉన్నాయని, ఎటువంటి వ్యాధీ నిర్ధారణ కాలేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. చెన్నైతో పాటు వివిధ ల్యాబ్‌లకు పంపిన బ్లడ్ కల్చర్ పరీక్షల నివేదికలు శనివారం వస్తాయని ఆమె చెప్పారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరణాలు

- తురకపాలెం ఘటనపై అంబటి, గోపిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తురకపాలెంలో మరణాలు జరిగాయని, కనీసం రక్షిత మంచినీటిని కూడా అందించలేదని అసమర్థతతో కూటమి ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తురకపాలెంలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కోరారు. ఇంటింటికీ ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేయాలని, జిజిహెచ్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రత్యేకవార్డు ఏర్పాటు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. సుదీర్ఘ పాలనా అనుభవం ఉన్న చంద్రబాబునాయుడికి ప్రజల ప్రాణాలు లెక్కలేకుండా పోయాయా అని ప్రశ్నించారు. వర్షాలతో నిండిన సంజీవయ్య గుంటలో నీటిని ట్యాంకు ద్వారా సరఫరా చేశారని, అలా ఎందుకు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. గ్రామంలో నీరు దొరకడం లేదని, ఐదు మద్యం బెల్టు షాపులు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు. చనిపోయిన వారందరూ జ్వరంబారినపడి అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యంపాలై ఆయాసం, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో చనిపోతున్నారని వివరించారు. తనపై కావాలనే ప్రభుత్వం కేసులు బనాయిస్తోందని, వాటికి భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. అన్నిటికీ సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చామని, దేన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని అన్నారు.

వైసిపి ఆఫీసులో ఉపాధ్యాయ దినోత్సవం

వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, జాలిరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. పలువురు టీచర్లను సన్మానించారు.

ప్రభుత్వం ఏం చేస్తోంది?

- తురకపాలెంలో మరణాలపై షర్మిల ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వ వైఫల్యానికి తురకపాలెం మరణాలు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్ షర్మిల తెలిపారు. గత 5 నెలలుగా మరణాలు సంభవిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటి వరకూ 35 మంది మరణిస్తే కారణాలు అన్వేషించి అరికట్టకపోవడం సిగ్గు చేటని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతుచిక్కని వ్యాధికి ఇంకా ఎంత మంది బలి కావాలని గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. ప్రజలు ప్రాణ భయంతో విలవిల్లాడుతుంటే మహమ్మారిని అదుపు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని వేయాలని, గ్రామంలోని ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకూ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ జరిగిన మరణాలకు బాధ్యత వహించి బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలని కోరారు.

15 నుంచి యుటిఎఫ్ రణభేరి

- ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తజాతా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు, విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి రణభేరి కార్యక్రమాన్ని యుటిఎఫ్ చేపట్టింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ ప్రసాద్ విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీకరించే పరిస్థితులను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'జాతా', 25వ తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని విమర్శించారు. ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యకు పరిష్కారం చూపడం లేదని పేర్కొన్నారు. మూడు నెలల క్రితం బదిలీలు, ప్రమోషన్లు పూర్తయినా ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే ఉన్నారని తెలిపారు. మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలహీనపడి విద్యార్థులు ప్రైవేటుబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో వంతు ప్రైమరీ స్కూళ్లల్లో ఒక టీచరే ఉన్నారని, హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళ్లుగా తయారయ్యాయని వివరించారు. చివరికి ఉపాధ్యాయులనే దోషులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో భార్యాభర్తలు ఒకేచోటకు చేరలేని పరిస్థితులు కల్పించారని పేర్కొన్నారు. మున్సిపల్, ట్రైబల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. 12వ పిఆర్‌సి కొత్త కమిషనర్‌ను నియమించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌గా మార్చేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి ఎస్‌పి మనోహర్ కుమార్, ప్రచురణల విభాగం చైర్మన్ ఎం. హనుమంతరావు, ఎన్‌టిఆర్ జిల్లా నాయకులు ఎ గోపాలకృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.


వీరారెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంఎ.గఫూర్, డి.గౌస్‌దేశాయ్, తదితరులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం

- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్


వీరారెడ్డి (ఫైల్)


సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి తండ్రి కెసి వీరారెడ్డి (88) అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయనకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య రావటంతో గురువారం కర్నూలు విశ్వభారతి హాస్పిటల్‌లో వైద్యం అందించారు. కోలుకోలేక శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటు వచ్చి కన్నుమూశారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వీరారెడ్డి వ్యవసాయం చేస్తూనే దీర్ఘకాలం టంగుటూరు బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు కె.ప్రభాకరరెడ్డి విద్యార్థి దశలోనే సిపిఎం రాజకీయాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరారెడ్డి మరణవార్త తెలిసిన వెంటనే సిపిఎం సీనియర్ నాయకులు కర్నూలు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు టి.రాముడు, జి.రామకృష్ణ, కె.వి.నారాయణ, జిల్లా నాయకులు ఇ.పుల్లారెడ్డి, టి.నరసింహ, వీరశేఖర్, నరసింహులు, షరీఫ్, రామకృష్ణ, సాయిబాబా, సుధాకరప్ప, రషీదా, అబ్దుల్లా, హుసేన్ బాషా తదితరులు ఆసుపత్రికి వెళ్లి నివాళులర్పించారు. వీరారెడ్డి మృతికి ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సీనియర్ నాయకులు వై.కేశవరావు సంతాపం తెలిపారు. వీరారెడ్డి అంత్యక్రియలు స్వగ్రామం నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరులో శనివారం నిర్వహిస్తారు.

బిసి సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డ్

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసి సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డ్ లభించినట్లు ఆ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ బిసి యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు 2025 సంవత్సరానికి ఈ అవార్డు అభించిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఎస్సి, సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు చెప్పారు. మెగా డిఎస్సిలో అత్యధిక పోస్టులు బిసి యువత సాధించాలనే లక్ష్యంతో బిసి స్టడీ సర్కిళ్లు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించి 1,674 మందికి శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. శిక్షణ పొందుతున్న వారికి నెలకు రూ.1,500 స్టయిఫండ్, పుస్తకాల కొనుగోలుకు మరో రూ.1,000 అందజేస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో మొత్తం 6,470 మందికి బిసి స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డిఎస్సికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. బిసి సంక్షేమ శాఖ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు ఎంపిక కావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఉచిత శిక్షణతో ఎందరో బిసి యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు.



రూ.791 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

- అమరావతిలో 12 జోన్లలో టెండర్లు పిలిచిన ఎడిసిఎల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగర నిర్మాణంలో కీలకమైన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించారు. మొత్తం 12 జోన్లలో సుమారు రూ.791 కోట్లతో నిర్మించబోయే ప్లాంట్లకు సంబంధించి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎడిసిఎల్) టెండర్లను ఆహ్వానించింది. 2019లో దీనికి సంబంధించిన పనులు నిలిచిపోయాయి. 2024లో టిడిపి ప్రభుత్వం రావడంతో మరలా ఇప్పుడు పనులు వేగవంతం చేశారు. మరోవైపు ట్రంక్ ఇన్‌ఫ్రా పనులు చేయాల్సి ఉండటంతో భవిష్యత్‌లో ఇబ్బంది రాకుండా ముందుగానే ఎస్‌టిపిలు నిర్మించాలని నిర్ణయించారు. దీనికితోడు పేదల గృహ నిర్మాణం కూడా దాదాపు పూర్తవడంతో వాటి వినియోగం కూడా పెరిగింది. అక్కడ ఉత్పత్తయ్యే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని ట్రీట్‌మెంట్ చేయాల్సి ఉంది. ఇప్పుడు ఆ పనులు చేయకపోతే త్వరలో చేపట్టే విలువైన పనులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. మొత్తం రాజధాని నగరం సమగ్ర ప్రణాళికలో ఉండటంతోపాటు ప్రపంచబ్యాంకు రుణం కూడా తీసుకోవడంతో వారి నిబంధనల ప్రకారమూ కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో ఎస్‌టిపిలు పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా 4,7,9,10 జోన్లలో రూ.290 కోట్లు, 12,3,5,6 జోన్లలో రూ.262 కోట్లు, 12, 12ఎ జోన్లలో రూ.207 కోట్లతో ఎస్‌టిపిలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 25 టెండర్ల దాఖలుకు ఆఖరి తేదీగా నిర్ధారించారు.



'యూరియా' కష్టాలు

- క్యూ లైన్లలో రైతులు
- పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - గరివిడి

రైతులకు యూరియా పాట్లు తప్పడంలేదు. విజయనగరం జిల్లా గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో శుక్రవారం యూరియా కోసం వందల మంది రైతులు బారులు తీరడంతో పోలీసుల సమక్షంలో పంపిణీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. వెదుళ్లవలసలో సుమారు 1500మంది, ఆవగూడెంలో 300 మంది రైతులు ఉన్నారు. కానీ వచ్చినవి మాత్రం 267 బస్తాలేనని తెలియడంతో రైతులు ఆందోళన చెందారు. తమకు ఎక్కడ యూరియా అందదేమోనన్న భయంతో ఉదయం నుంచే రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. పరిస్థితిని గమనించిన వ్యవసాయ శాఖ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలోనే ఎడి ఎస్ కోటేశ్వరరావు, ఎఒ ప్రసాదరావు యూరియాను పంపిణీ చేశారు. 267 మంది రైతులకు యూరియా పంపిణీ చేసి, మిగతా వారి వివరాలు నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో మిగతా వారికి యూరియా అందిస్తామని ఎఒ తెలిపారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని రైతులు ప్రశ్నించారు. యూరియా ఇవ్వడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను అర్థం చేసుకొని సరిపడా ఎరువులు ఇవ్వాలని కోరారు.

తురకపాలెం మరణాలపై లోతైన అధ్యయనం

చంద్రబాబు ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా తురకపాలెంలో సంభవిస్తున్న మరణాలపై లోతైన అధ్యయనం చేయాలని వైద్యారోగ్యశాఖాధికారులను సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. అధికార యంత్రాంగం ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత వైద్యాధికారులదేనని సిఎం స్పష్టం చేశారు. ఈ అంశాన్ని హెల్త్ ఎమర్జెన్సీగా పరిగణించాలన్నారు. వరుస మరణాలు, అంతుచిక్కని వ్యాధి, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో వైద్యారోగ్యశాఖాధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు.. జూలై, ఆగస్టు నెలల్లో ఈ గ్రామం నుంచి 20 మంది చనిపోయేందుకు కారణాలపై తొలుత దృష్టిపెట్టాలని సిఎం పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 6,7 తేదీల్లో ప్రత్యేక వైద్యబృందాలు తురకపాలెం పంపించి, గ్రామంలోని అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహించి ఈనెల 8 కల్లా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని సిఎం అధికారులను సిఎం ఆదేశించారు. ఎయిమ్స్‌తో సహా కేంద్ర వైద్యబృందాల సహాయం తీసుకోవడంతో పాటు అవసరమైతే అంతర్జాతీయ వైద్యుల సహాయం తీసుకోవాలని సిఎం అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

"మెలియాయిడోసిస్"లక్షణాలు : వైద్యాధికారులు

తురకపాలెంలోని కేసులను పరిశీలిస్తే "మెలియాయిడోసిస్" లక్షణాలు ఉన్నట్లు వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్లడ్ శాంపిల్స్ ల్యాబ్‌లకు పంపడంజరిగిందని, 72 గంటల్లో రిపోర్టులు వస్తాయని సిఎం చంద్రబాబుకు వైద్యాధికారులు తెలిపారు. పశుపోషణపైన ఎక్కువమంది ఆధారపడడంతో పశువుల నుంచి ఏమైనా బాక్టీరియా వ్యాప్తి చెందవచ్చనే కోణంలోనూ పరిశీలన జరుపుతున్నామన్నారు. తురకపాలెంలో డయాబెటీస్, హైపర్ టెన్షన్, కార్డియాక్, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, అదే విధంగా అక్కడ ఆల్కహాల్ వినియోగం అధికంగా ఉందని అధికారులు సిఎంకు వివరించారు.

ఆస్తులను పప్పుబెల్లాల్లా అమ్ముతున్నారు

- మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంపద సృష్టిస్తానని ఎన్నికల ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలో రాగానే ఆస్తులన్నీ పప్పుబెల్లాల్లా అమ్ముతున్నారని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో శుక్రవారం చేసిన పోస్టులో ప్రజల కోసం కాకుండా దోపిడీ కోసం నిర్ణయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 1923 నుండి 2019 వరకూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల సంఖ్య 12 అని, వైసిపి అధికారంలోకి వచ్చాక 17 కళాశాలలు మొదలుపెడితే ఐదు పూర్తయి క్లాసులు కూడా ప్రారంభం అయ్యాయని వివరించారు. ఆ పనిచేయకుండా కాలేజీలు వచ్చిన తరువాత భూములు రేట్లు పెరగడంతో వాటిని కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో 2360 ఎంబిబిఎస్ సీట్లు ఉంటే వైసిపి హయాంలో వాటిని 4910 సీట్లకు పెంచే పనిచేశామని పేర్కొన్నారు. ప్రతి జిల్లాల్లో వైద్య ఆరోగ్య రంగంలో ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ రంగం కూడా ఉండాలని, అప్పుడే నాణ్యమైన వైద్యం అందుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదవాళ్ల ఆరోగ్య భద్రతను ప్రమాదంలో పడేశారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ బాధ్యత నుండి తప్పుకుని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం ఘనకార్యంగా చెప్పుకోవడం సరికాదని తెలిపారు. ఆరోగ్యశ్రీకి రూ.3600 కోట్లు కట్టడానికే ఇబ్బంది పడుతూ రేపు ఇన్సూరెన్స్ ప్రీమియం పేరుతో రూ.5 వేల కోట్లు ఎక్కడ నుండి తెచ్చి కడతారని ప్రశ్నించారు. బాధ్యతగా ప్రభుత్వం చేసిన పనికి, ప్రైవేటు కంపెనీలు చేసే పనికి తేడా ఉంటుందని వివరించారు. కోవిడ్ సమయంలో అన్ని కంపెనీలు చేతులు ఎత్తేస్తే ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించిందని వివరించారు.

సురవరం స్ఫూర్తితో పోరాటం

- సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- కమ్యూనిస్టుల త్యాగాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : ఎంఎ గఫూర్


సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణ, ఎంఎ గఫూర్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సురవరం సుధాకర్ రెడ్డి స్ఫూర్తితో పోరాటాలు చేస్తామని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ... కమ్యూనిస్టు వ్యవస్థను త్రికరణ శుద్ధిగా సుధాకర్‌రెడ్డి నమ్మారని, చివరి దాకా అందుకోసం పోరాడారని కొనియాడారు. నిండుకుండ తొనకదు అనే దానికి ఆయనే నిదర్శనమన్నారు. సురవరం తెరిచిన పుస్తకం అని, ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. 2026 నాటికి నక్సలైట్లు లేని ఇండియాను తీసుకొస్తామని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారని, నక్సలైట్లను ఓడించి గెలవాలని, చంపేస్తాం అనడం విచిత్రంగా ఉందన్నారు. మనుషులను చంపినా సిద్ధాంతాలను చంపడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థల్లోనే అంతర్గత పోరు సాగుతోందని దీని వల్ల రాజకీయ సంక్షోభం వస్తే అందుకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. కర్నూలులో విద్యను అభ్యసించిన సురవరం సుధాకర్‌రెడ్డి పేరు గుర్తుండేలా కర్నూలులో ఏదో ఒకటి చేయాలని నాయకులను కోరారు.

భావితరాలకు ఆదర్శం : ఎంఎ గఫూర్

సురవరం సుధాకర్ రెడ్డి భావితరాలకు గొప్ప ఆదర్శమని, ఆయన నుంచి చాలా నేర్చుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. సురవరం విద్యాభ్యాసం, ప్రాథమిక రాజకీయ జీవితం కర్నూలులోనే ప్రారంభమయ్యిందని వివరించారు. ధనిక రైతు కుటుంబంలో జన్మించినా ప్రజాపక్షపాతిగా ప్రజల కోసం జీవితాన్ని త్యజించారని, చివరకు ఆయన దేహాన్ని కూడా దానం చేశారని కొనియాడారు. ప్రస్తుతం అన్ని వర్గాల సిద్ధాంతాల ప్రభావం పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల త్యాగాల గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రజలు నూతన సమాజం కోరుకునేలా పనిచేయాలని కోరారు. రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ మాట్లాడుతూ... సురవరం సుధాకర్ రెడ్డి ప్రసంగం ప్రేమగా, సౌమ్యంగా ఉంటుందన్నారు. సురవరం పేరు నిలిచిపోయేలా కర్నూలులో ఏదో ఒకటి చేస్తామని ప్రకటించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. పెత్తందారీ వ్యవస్థను రూపుమాపడానికి సురవరం కృషి చేశారన్నారు. సురవరం పోరాటాలను, సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల కోసం సుధాకర్ రెడ్డి నిరంతరం పోరాడారని, ఆయన కర్నూలులో విద్యాభ్యాసం చేయడం జిల్లాకు గర్వకారణం అని తెలిపారు. తొలుత సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి రామచంద్రయ్య, కె.రామాంజనేయులు, ఆవులశేఖర్, ఎస్‌యుసిఐ నాయకులు నాగన్న, సురవరం స్నేహితుడు రామచంద్రారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై సమాచారం ఇవ్వండి

- ఉపాధ్యాయులకు ఈగల్ ఐజి రవికృష్ణ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యాసంస్థల సరిహద్దుల్లో పొగాకు ఉత్పత్తులతోపాటు గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు లేదా వాటి మూలాలు ఉన్నట్లు గమనిస్తే సమాచారాన్ని ఈగల్ సిబ్బందికి అందించాలని ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. సమాచారాన్ని అందించేవారు టోల్‌ఫ్రీ నెంబరు 1972కి లేక వాట్సాప్ నెంబర్ 8977781972 నెంబరుకు లేదా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంలో 'ఈగల్' టీచర్‌గా తాను వ్యవహరిస్తున్నట్లు రవికృష్ణ పేర్కొన్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి

- ఆటో, క్యాబ్ డ్రైవర్ల ధర్నా


విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-విజయవాడ

మహిళలకు ఉచిత బస్సు కారణంగా తీవ్రంగా ఉపాధి కోల్పోతున్న తమకు సంవత్సరానికి రూ.25 వేలు చొప్పున టిడిపి కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. కార్మికులు అర్ధ నగ్నంగా, మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె దుర్గారావు మాట్లాడుతూ ఉచిత బస్సు కారణంగా ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధి పూర్తిగా దెబ్బతిందని, దీంతో ఆటో ఫైనాన్స్ కట్టలేకపోతున్నామని, కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు ఆర్థిక సాయం ప్రకటించాలని, సిఎన్‌జి గ్యాస్ సబ్సిడీతో ఇవ్వాలని, ఇన్సూరెన్స్ రేట్లు తగ్గించాలని, బ్రేక్ (ఫిట్నెస్) ఉచితంగా చేయాలని, జిఒ 21 రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల తొమ్మిదిన విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మీసాల రాజేశ్వర వంతెన సీతన్నపేట సిగ్నల్ డివైడర్ల వద్ద పెద్ద ఎత్తున ఆటో ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం హనుమంతరావు, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కె దుర్గావళి, రైల్వే స్టేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి కోటయ్య ఎవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన వర్ధంతి సభలో ఆర్‌ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా నేతలు

పోరాట యోధుడు ఆర్‌ఎస్

- ప్రథమ వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) పోరాట యోధుడని, ఆయన ఆశయ సాధనకు కంకణబద్ధులై కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభలు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో శుక్రవారం పెద్దసంఖ్యలో జరిగాయి. జిల్లా కేంద్రమైన ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎస్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఆర్‌ఎస్ గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. జిల్లా ఉద్యమంలో ఆయన ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సభలో ఆర్‌ఎస్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్ జీవితం కార్మిక వర్గానికి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆదర్శనీయమని అన్నారు. ఉండిలో జరిగిన సభలో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, పాలకొల్లులో మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడారు. నూజివీడు టౌన్, జంగారెడ్డిగూడెం, పోలవరం, కొయ్యలగూడెం, నిడమర్రు, కలిదిండి ముదినేపల్లి మండలాల్లో, తాడేపల్లిగూడెం, గణపవరం, ఆచంట, పెంటపాడు, నరసాపురం, పెనుమంట్ర, ఆకివీడు తదితర కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యాన ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభలు నిర్వహించారు. ఆర్‌ఎస్ స్వగ్రామం యలమంచిలి మండలం చించినాడలో నిర్వహించిన సభలో ఆర్‌ఎస్ సహచరుడు, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు మాట్లాడారు.

విశాఖ డబుల్ డెక్కర్ మెట్రోకు రూ.6250 కోట్లతో టెండర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో మూడు కారిడార్లలో మెట్రో నిర్మించేందుకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. రూ.6250 కోట్లతో ప్రాజెక్టును నిర్మించనున్నట్లు టెండర్లలో పేర్కొంది. ఈ మేరకు అంతర్జాతీయ పోటీ టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 12వ తేదీతో టెండర్ గడువు ముగియనుంది. ఈ ప్రాజెక్టులో మొత్తం 46.23 కిలోమీటర్ల దూరం కారిడార్ నిర్మించనున్నారు. ఇందులో 20.16 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ నాలుగులైన్ల ఫ్లైఓవర్ ఉండనుంది. 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు.

జిఎస్‌టి రేట్ల తగ్గింపుతో.. రూ.3,700 కోట్ల నష్టం!

- ఆర్థిక లోటుపై ప్రభావం ఉండదు
- ద్రవ్యోల్బణం తగ్గొచ్చు
- ఎస్‌బిఐ కీలక రిపోర్ట్



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) రేట్ల తగ్గింపునతో ప్రభుత్వం రూ.3,700 కోట్ల ఆదాయం మాత్రమే కోల్పోయే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఓ రిపోర్ట్‌లో తెలిపింది. జిఎస్‌టి రేట్ల శ్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించడం ద్వారా ఏడాదికి రూ.48వేల కోట్ల నష్టం జరగొచ్చని ప్రభుత్వం ఇటీవల అంచనా వేసిన విషయం తెలిసిందే. పన్నుల తగ్గింపు ద్వారా వినియోగం, వృద్ధి పెరగడంతో నష్టం రూ.3,700 కోట్లకు పరిమితమవుతుందని ఎస్‌బిఐ తన రిపోర్ట్‌లో పేర్కొంది. ఇది ఆర్థిక లోటుపై ఎటువంటి ప్రభావం చూపదని వెల్లడించింది.

ఈ నెల 3న జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న 5, 12, 18, 28 శ్లాబుల స్థానంలో రెండు శ్లాబులను ఎత్తివేసి 5 శాతం, 12 శాతం శ్లాబుల విధానాన్ని ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు విలాస వస్తువులపై 40 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. జిఎస్‌టి రేట్ల సవరణలతో బ్యాంకింగ్ రంగానికి వ్యయం తగ్గి, సానుకూల ప్రభావం ఉంటుందని ఎస్‌బిఐ పేర్కొంది. దాదాపు 295 వస్తువుల జిఎస్‌టి రేట్లు 12 శాతం నుండి 5 శాతం లేదా సున్నాకు తగ్గడంతో ఆ విభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25-30 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చని అంచనా. మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం 2026-27 నాటికి 65-75 బేసిస్ పాయింట్లు దిగిరావొచ్చని పేర్కొంది. డిమాండ్ పెరగడంతో మరోవైపు జిడిపి 0.1-0.2 శాతం పెరగొచ్చని అంచనా వేసింది. రేట్ల తగ్గింపునతో ప్రధానంగా ఎఫ్‌ఎంసిజి, రిటైల్, ఆటోమొబైల్స్, సిమెంట్, ఇన్సూరెన్స్ రంగాలు లబ్ధి పొందుతాయని విశ్లేషించింది.

ఘోరంగా రూపాయి

- డాలర్‌తో పోల్చితే 88.27కు క్షీణత

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ ఆల్‌టైం కనిష్ట స్థాయికి పడిపోయింది. రూపాయి చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో 88.27కు పతనమయ్యింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం తదితర పరిణామాలు దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 15 పైసలు పతనమై 88.27కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 88.11 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.38 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెప్టెంబర్ 2న 88.15 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరిగిపోనుంది. ముడి చమురు బ్యారెల్ ధర 0.25 శాతం తగ్గి 66.82 వద్ద నమోదయ్యింది.

సంపాదకీయం

అనర్థదాయకం!

సామాన్యులకు ఎంతోకొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను, రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం అనర్థదాయకం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది జనాన్ని వైద్య ఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు బీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల వరకు, ఆపైన ఖర్చయితే ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందన్నది ప్రచారానికి బాగానేవుంటుంది. దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామనీ ఇదంతా కలిపి యూనివర్సల్ హెల్త్ కవరేజి అని సర్కారు నమ్మబలుకుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2015-16ల్లో ఎపిఎల్ కుటుంబాలకూ హెల్త్ కవరేజి అని ప్రచారం చేసి ప్రీమియంలు కట్టించుకున్నారేకానీ ప్రజలకు లబ్ధి చేకూరిన దాఖలాల్లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్న అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు.

రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కనబెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి కనుక పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారు. వ్యాపార దక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. వైద్య ఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైంది. యుకె, నెదర్లాండ్స్ ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తోంది. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ సేవ చేయవు. అనర్థదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్య సేవలను కొనసాగించాలి. సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఓ 107, 108ని రద్దు చేయాలి.

ఇదిలావుండగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించి ప్రైవేటు పంప్డ్ స్టోరేజి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన ప్రభుత్వం గురువారంనాటి క్యాబినెట్ సమావేశంలో వాటి సామర్థ్యం పెంచడం, నీటి కేటాయింపులను కూడా చేయడం దారుణం. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెబుతున్నా ఆచరణలో నదుల్లోని నీటిని విద్యుత్ ప్రాజెక్టులే పొందుతాయి కనుక దిగువనున్న ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కడప జిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఏకంగా గండికోట రిజర్వాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించడానికి ఆమోదం తెలపడం ప్రమాదకరం. గత వైసిపి ప్రభుత్వ పెద్దలు లంచాలు బొక్కి ఒప్పందాలు చేశారని అమెరికాలో కేసులు వచ్చిన సెకి చేసిన సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ.800 కోట్ల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ద్వారా ఇప్పుడు కూడా గత పాలకుల విధానాలే కొనసాగుతున్నాయని చెప్పడమే అవుతుంది. సామాన్యులకు అందే వైద్య ఆరోగ్య సేవలను వారికి దూరం చేసి అదాని అంబానీ వంటి కార్పొరేట్లకు కాసులు కురిపించే విధానాలను ప్రభుత్వం విడనాడాలి. అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు హాని జరగడమేగాక ప్రభుత్వానికి కూడా రాజకీయంగా చేటు కలగవచ్చు

మహనీయుల మాట



మూఢ విశ్వాసాలను, హేతువాదానికి నిలబడని వాదనలను విశ్వసించకూడదు. సమాజం చైతన్యవంతంగా రూపొందాలంటే కాలాన్ని అనుసరించి పురోగమించాలి.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

స్వతంత్ర విదేశాంగ విధానం ప్రధానం

వ్యాఖ్య



అమెరికా భౌగోళిక, రాజకీయ, వ్యూహాత్మక క్రీడలో సహాయక పాత్రగా వుండే మార్గం నుంచి విడగొట్టుకోవడానికి ఈ సంధి దశను ఓ అవకాశంగా చూడాలి. బ్రిక్స్, షాంఘై క్రమం ద్వారా వ్యక్తమైన మార్గంలో పేద దేశాలతో నిజమైన భాగస్వామ్యం పెంచుకోవాలి. ఈలోగా సుంకాల యుద్ధం రంగాల వారీగా ప్రసరించే ప్రభావాన్ని ప్రభుత్వం అధ్యయనం చేయాలి. ఇందులో మరీ ఎక్కువగా దెబ్బ తినే చిన్న పరిశ్రమలు,ఉద్యోగాలు, వ్యవసాయ రంగాలను ఆదుకునే విధాన చర్యలు ఉధృతం చేయాలి. అమెరికాతో వాణిజ్యంలో దానిపై ఆధారపడటాన్ని వదులుకోవడం వల్ల కలిగే పెద్ద దెబ్బను తట్టుకోవడానికి ఉపకరించే దోహదకారులు కావలిసినన్ని వున్నాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

తియాన్‌జిన్ రేవు పట్టణం షాంఘై సహకార సమితి (ఎస్.సి.వో) శిఖరాగ్ర సమావేశానికి ఘనంగా ఆతిథ్యమిచ్చింది. ఎస్.సి.వో తన పరిధిని విస్తరించుకుని ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాలు, ఇంధన రంగాలను కూడా చేర్చుకుంది. భారత్, పాకిస్తాన్‌లు 2017లో దీనిలో పూర్తి స్థాయి సభ్యులుగా చేరగా తర్వాత ఇరాన్ 2023లో, బెలారస్ 2024లో చేరాయి. 21వ శతాబ్ది సవాళ్లనూ అవకాశాలను ఎస్.సి.వో స్వీకరించిందని చెప్పడానికి సంకేతమా అన్నట్లు చైనా ఇటీవలి కాలంలో సాధించిన ఆశ్చర్యకర పురోగమనాన్ని ప్రతిబింబించే ప్రదర్శన నిర్వహించింది. శిఖరాగ్ర వేదిక పక్కనే వున్న మీడియా కేంద్రం వద్ద జరిగిన ఈ ప్రదర్శనలో మానవశక్తి రోబోలనూ, కృత్రిమ మేధ ఎ.ఐ తో నడిచే వ్యవస్థను ప్రదర్శించింది. భద్రతనూ జవాబుదారీతనాన్ని పెరుగు పర్చుకునే క్రమంలో ఎ.ఐ ని ఉపయోగించుకోవడంలో చిక్కులను తగ్గించుకోవడానికి సహకరించుకోవాలని సభ్యదేశాలు అంగీకారానికి వచ్చాయి.

ప్రస్తుతం క్లిష్టమైన సమయం నడుస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతలో ఎద్దు వచ్చిపడిన తరహాలో టారిఫ్ దురాక్రమణ చేస్తున్నాడు. ఇలాంటి నేపథ్యంలో తియాన్‌జిన్ సమావేశం కీలకంగా దృష్టిని ఆకర్షించడం సహజం. అమెరికాను మళ్లీ గొప్ప స్థానంలోకి తీసుకు రావాలంటున్న (ఎం.ఎ.జి.ఎ) ట్రంప్ ఎజెండాతో ఇప్పటి వరకూ నిబంధనల ప్రకారం నడుస్తున్న వాణిజ్య వ్యవస్థను తనకే అత్యధిక లాభాలు చేకూర్చే విధంగా ద్వైపాక్షిక ఒప్పందాల దిశలోకి మారుస్తున్నది. ఈ కారణంగా- అమెరికా నాయకత్వంలోని ప్రపంచ వ్యవస్థకు మరింత వేగవంతమైన తక్షణ ప్రతిస్పందన కావాలనే హడావుడి పెరిగిన అంశాన్ని ఇది పట్టి చూపించింది. ఈ మార్పు నిస్సందేహంగా ఒక బహుళ ధ్రువ ప్రపంచం అవసరాన్ని నాటకీయమైన రీతిలో కళ్లకు కట్టింది.

ట్రంప్ ఉన్మాదానికి పాఠం

ఇండియా రష్యా నుంచి చమురు కొని ఎక్కువ లాభానికి అమ్ముకుంటున్నదనే సాకు ప్రధానంగా ముందుకు తెచ్చి భారత్, బ్రెజిల్ దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు దారుణంగా వేటు వేశాయి. నిజానికి ట్రంప్ ఉన్మాదపూరితంగా తయారైనాడు. "ఇండియా మాపై అంతటి హెచ్చు టారిఫ్‌లు విధించింది. మాతో వాణిజ్యం చేసే అనేక దేశాలు ఆ కారణంగా దానికి అమ్మకాలు చేయలేకపోతున్నాయి." అనీ, భారత దేశ "ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా" తయారైందనీ, దాంతో వ్యాపారం చేయడమంటే "కోరి ఏకపక్ష వినాశనం" కొని తెచ్చుకోవడమేననీ నోరు పారేసుకున్నాడు. సైనిక ఘర్షణల విరమణలో తన పాత్రకు భారత్ తగినంత గుర్తింపునివ్వలేదని కూడా ట్రంప్ కుదేలైపోయాడు. ఆయన సహాయకులొకరైతే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి భారత్ కారణమనేంత వరకూ వెళ్లారు. ఇవన్నీ ఎంత వరకూ నిజాలో ఎవరైనా ఊహించుకోవచ్చు. అయితే ఇక్కడ సందేశం భారత్‌కు మాత్రమే కాదు. తమకు సంతృప్తికరమైన విధంగా ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే విధంగా భారత్‌ను లొంగదీసు కోవడమే ఇక్కడ అమెరికా ప్రధానోద్దేశం.

బహుళ ధ్రువ ప్రపంచ దృశ్యం, సామర్థ్యం, సత్తా ఏమిటో తియాన్‌జిన్ చూపెట్టింది. సీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్, నరేంద్ర మోడీలు అక్కడ వుండటం సుస్థిర ప్రపంచ వ్యవస్థను నొక్కి చెప్పింది. ప్రాంతీయ, ప్రపంచ భద్రతపై ఎస్.సి.వో కేంద్రీకరించింది. తియాంజియన్ డిక్లరేషన్ ఏ మాత్రం అస్పష్టత లేకుండా ఇలా ప్రకటించింది:"ఇజ్రాయిల్, అమెరికాల సైనిక దాడులను తీవ్రంగా ఖండించింది. అవి అంతర్జాతీయ చట్టాలనూ ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించేవిగా వున్నాయి. ఇరాన్ సార్వభౌమాధికారానికి తూట్లు పొడిచేవిగా జరిగాయి" అని పేర్కొంది. గతంలో ఈ ఒక్క అంశంపై ఎస్.సి.వో చేసిన ప్రకటనపై ఇండియా తీసుకున్న అస్పష్టమైన వైఖరికి పూర్తి భిన్నం. ఈ నిర్ణయం తీసుకోవడంలో తాము పాలుపంచుకోలేదని అప్పట్లో విదేశాంగ శాఖ ప్రతినిధి ప్రకటించారు. 'విచారం వెలిబుచ్చడం' వరకే పరిమితమై చర్చలు జరపాలనీ, దౌత్య మార్గాలు చూడాలనీ చెప్పింది. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ పట్ల కూడా గతంలో ఇదే వైఖరిని ప్రకటించింది. అమెరికా ఆ నేరంలో కడదాకా భాగస్తురాలైంది. ఈ వైఖరి మార్పును తియాన్‌జిన్ తీర్మానం నొక్కి చెబుతున్నది. పాలస్తీనా, ఇజ్రాయిల్ ఘర్షణ తీవ్రం కావడం పట్ల తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. అనేకానేక పౌర మరణాలు, గాజాలో విపత్కరమైన మానవీయ సంక్షోభ పరిస్థితులకు కారణమైన చర్యలను ఖండించింది.

ప్రధాన సంకేతం

తియాన్‌జిన్ సమావేశానికి ముందు మోడీ, జిన్‌పింగ్‌లు శిఖరాగ్ర సమావేశం జరిపినప్పుడే గాలి ఎటు వీస్తున్నదీ స్పష్టమైపోయింది. భారత్, చైనాలు భాగస్వాములేగానీ విరోధులు కాద' న్నది ఉమ్మడి స్ఫూర్తిగా వచ్చిన ప్రధాన సందేశం. బహుళ ధ్రువ ప్రపంచం, వాణిజ్య స్వేచ్ఛను ప్రముఖంగా చెబుతూ న్యాయమైన, సహేతుకమైన పరస్పర అంగీకార యోగ్యమైన పరిష్కారాలను కనుగొనాలని ఈ రెండు గొప్ప పొరుగు దేశాలు అవగాహనకు వచ్చాయి. విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొన్నట్టుగా ప్రపంచ వాణిజ్య సుస్థిరత సాధించడంలో ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థల పాత్రను ప్రస్తావించాయి. విధానపరమైన స్వీయ నిర్ణయాధికారాన్ని ఇరు దేశాలు పాటిస్తాయి. ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకునే దిశలో బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని సీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. మొత్తం భారత్, చైనా సంబంధాలను సరిహద్దు సమస్యను బట్టి మాత్రమే నిర్ణయించరాదని కూడా ఆయన చెప్పారు. దీన్నే అలంకార భాషలో "డ్రాగన్ గజరాజుతో నృత్యం చేసే సమయం ఆసన్నమైందని" అభివర్ణించారు. బిజెపి ఐ.టి విభాగం బలగాలు చైనా పైన, దాని నాయకత్వం పైన విషం కక్కిన తీరు గమనించిన భారతీయ వీక్షకులు ఈ మొత్తం సందేశంలో దాగివున్న విచిత్రాన్ని తేలిగ్గా తెలుసుకోగలరు.

ఒక విధంగా చెప్పాలంటే తియాన్‌జిన్ రియో డి జనీరో లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి సజావుగా జరిగిన కొనసాగింపు. దురదృష్టవశాత్తు అక్కడ సీ జిన్‌పింగ్, పుతిన్ ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయారు. జులై 5న బ్రిక్స్ సమావేశంలో అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి టారిఫ్‌ల హెచ్చింపునూ ఇరాన్‌పై దాడులనూ ఖండించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు మాత్రం ప్రస్తావించలేదు. ఆ బృందం విడుదల చేసిన ప్రకటన కూడా మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయిల్ సైనిక చర్యలపై విమర్శలు చేసింది. అయితే తన సభ్య దేశమైన రష్యాను ఉపేక్షించి యుద్ధంలో చితికిపోయిన ఉక్రెయిన్‌ను ఒక్కసారి ప్రస్తావించింది.

బ్రిక్స్ షాంఘై ప్రభావం

బ్రిక్స్‌ను బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా కలసి స్థాపించాయి. అయితే గత ఏడాది ఇరాన్, ఇండోనేషియా, ఈజిప్టు, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లను కూడా కలుపుకొని విస్తరించింది. ఈ కూటమిలో వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలుగా వున్నాయి. గతేడాది ఏర్పరచుకున్న ఈ విభాగంలో బెలారస్, క్యూబా వియత్నాం వున్నాయి. ప్రవర్ధమాన దేశాలు స్పందించడానికి, ప్రత్యామ్నాయాలు చూసుకోవడానికి, ఆర్థిక భాగస్వామ్యం వైవిధ్యభరితం చేసుకోవడానికి ఈ శిఖరాగ్ర సమావేశం నిజంగా అత్యుత్తమ అవకాశం సమకూర్చింది.

బ్రిక్స్ కూటమి ప్రపంచ ఆర్థిక దృశ్యాన్ని త్వరితగతిన మార్చేస్తున్నది. సృజనాత్మకమైన వాణిజ్య ఒప్పందాలు, వ్యూహాత్మక ఆర్థిక చొరవలతో బ్రిక్స్ అంతర్గత వాణిజ్యం పాశ్చాత్య దేశాల ప్రాబల్యంలోని మార్కెట్లకు శక్తివంతమైన ప్రతిశక్తిగా ఆవిర్భవిస్తున్నది. ఇటీవల సంవత్సరాలలో బ్రిక్స్ దేశాలు తమ మధ్య వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుకున్నాయి. ఉమ్మడి జిడిపి లెక్కలు, విస్తరిస్తున్న వినియోగదారుల పునాదితో ఈ వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు అంతర్గత వాణిజ్యాన్ని సాధనంగా మార్చుకుని సంప్రదాయిక ప్రపంచ కరెన్సీపై, పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై పరాధీనతను తగ్గించుకోగలుగుతున్నాయి. ఉదాహరణకు 2022లో బ్రిక్స్ అంతర్గత వాణిజ్యం 60,000 కోట్ల డాలర్ల పైనే వుంది. డాలర్‌తో సంబంధం లేని స్థానిక ఆర్థిక సహకారం దిశలోకి ప్రయత్నపూర్వకంగా మరలడాన్ని ఇది సూచిస్తుంది.

తమదైన శైలిలో చెట్టపట్టాలేసుకుని తిరిగే ట్రంప్, మోడీ 'పప్పీ ఝుప్పీ' మార్కు దౌత్య పోకడల అసలు రంగేమిటో తాజా టారిఫ్ దాడితో తేలిపోయింది. అమెరికా ఆదేశాలకు లోబడి ఇండియా వాణిజ్య ఒప్పందానికి రాలేకపోయింది. విశాల భౌగోళిక దృష్టితో భారతదేశ ప్రయోజనాలను ట్రంప్ చూడటం లేదని తేలిపోయింది. ఆసియాలో బలాబలాల సమతుల్యతకు సంబంధించి భారత దేశం విలువేమిటో ఆయనకు తెలియలేదని అర్థమైపోయింది.

గొప్పలకు తూట్లు, అసలు నిజాలు

అయితే మోడీ, బిజెపి నాయకత్వం లోని ప్రభుత్వం కోసం కన్నీరు కార్చే వారెవరూ వుండరు. భారత అమెరికా సంబంధాలను గమనిస్తున్న వారికి మాత్రం ఇది పెద్ద ఆశ్చర్యం కలిగించదు. ఇది ఎప్పుడో జరగవలసి వున్నదే. ఆపరేషన్ సిందూర్ తర్వాత మోడీ ప్రభుత్వం ఎన్ని గొప్పలైనా పోవచ్చు. కానీ కాల్పుల విరమణకు తానే కారణమంటూ ఉన్మాద పూరితంగా ట్రంప్ ఏకపక్షంగా చెప్పుకోవడం చూసినప్పుడు ఆయన వీరిని పూచికపుల్లగా కూడా చూడబోరని తేలిపోయింది. ఇండియా, పాకిస్తాన్‌లను ఒకే గాటకట్టి చూడటంతో ప్రాంతీయ, ప్రపంచ బలాల తాసులో ఇండియా విలువెంతో చెప్పినట్టయింది. ఆ విధంగా అది వ్యూహాత్మక ప్రాధాన్యత కోల్పోయింది. జాతీయ ప్రయోజనాలు వ్యూహపరమైన స్వతంత్రత ప్రమాణంగా ఒక స్వతంత్ర విదేశాంగ విధానం వుండాలని వామపక్షాలు ఎప్పుడూ హెచ్చరిస్తూనే వచ్చాయి.


సామ్రాజ్యవాదం తీరు "పులి మచ్చలు మార్చుకోలేద"న్నట్టే వుంటుంది. వామపక్షాన్ని అటుంచి-అమెరికా విదేశాంగ నీతిలో అత్యంత ఉద్దండుడైన హెన్రీ కిసింజర్ కూడా సూటిగా ఈ మాటే చెప్పాడు. "అమెరికాకు శత్రువుగా వుండటం ప్రమాదకరం. వాటేసుకోవడం ప్రాణాంతకం". కానీ ఆ విధంగా విధాన స్పష్టత ఆరెస్సెస్, బిజెపి కూటమి ఇవ్వలేవు.

ఇది వాస్తవాన్ని కళ్ళు విప్పి చూడాల్సిన సమయం. అమెరికా భౌగోళిక, రాజకీయ, వ్యూహాత్మక క్రీడలో సహాయక పాత్రగా వుండే మార్గం నుంచి విడగొట్టుకోవడానికి ఈ సంధి దశను ఓ అవకాశంగా చూడాలి. బ్రిక్స్, షాంఘై క్రమం ద్వారా వ్యక్తమైన మార్గంలో పేద దేశాలతో నిజమైన భాగస్వామ్యం పెంచుకోవాలి. ఈలోగా సుంకాల యుద్ధం రంగాల వారీగా ప్రసరించే ప్రభావాన్ని ప్రభుత్వం అధ్యయనం చేయాలి. ఇందులో మరీ ఎక్కువగా దెబ్బ తినే చిన్న పరిశ్రమలు, ఉద్యోగాలు, వ్యవసాయ రంగాలను ఆదుకునే విధాన చర్యలు ఉధృతం చేయాలి. అమెరికాతో వాణిజ్యంలో దానిపై ఆధారపడటాన్ని వదులుకోవడం వల్ల కలిగే పెద్ద దెబ్బను తట్టుకోవడానికి ఉపకరించే దోహదకారులు కావలిసినన్ని వున్నాయి.

(సెప్టెంబరు 3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కన్నీటి కష్టాలు ఇంకెంత కాలం?

విశ్లేషణ



సిహెచ్. బాబూరావు

బుడమేరు ముంపు బాధితులను నిరుటి పీడకల నేటికీ వెంటాడుతోంది. గత ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ. తెలతెల వారుతూనే ప్రజలను బుడమేరు వరద చుట్టుముట్టింది. మెల్లగా కాదు. వేగంగా. గంటల వ్యవధిలోనే పీకల్లోతున ముంచేసింది. విజయవాడ, పరిసర ప్రాంతాలు రోజుల తరబడి వరద నీటిలోనే ఉండిపోయాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కరెంటు లేక, నీళ్ల లేక అక్కడి నుంచి బయటపడేందుకు విఫలయత్నం చేసిన వారెందరో. అదే సమయంలో కృష్ణా నదితో పాటు పలు వాగులు పొంగి, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ప్రజలు ముంపుబారిన పడ్డారు. అధికారుల లెక్కల ప్రకారమే బుడమేరు ముంపుతో ఆరున్నర లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 2లక్షల 75 వేల ఇళ్లు మునిగిపోయాయి. 50 మంది పైగా మృతి చెందారు. వేలాది కోట్ల రూపాయల ఆస్తి, పంట నష్టం వాటిల్లింది. చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. ఏడాది గడిచింది. ఇంకా జనం కోలుకోలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, బయట పడలేకపోతున్న వారెందరో.

పరిష్కారమెక్కడ?

ప్రజల దు:ఖాన్ని సైతం రాజకీయం చేయగలవారున్న చోట కంటి తుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం లభించదనేందుకు ఈ ఏడాది కాలంలో పాలకుల వ్యవహార శైలే నిదర్శనం. సంక్షోభాలను సానుకూలంగా మార్చుకోవాలని పదేపదే చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరు వరదలను సైతం ప్రచారానికి, రాజకీయ లబ్ధికే వినియోగించుకున్నారు. పడవల్లో తిరిగారు. కలెక్టరేట్లోనే వారం కాపురం ఉన్నానని ఆర్భాటం చేశారు. కానీ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవడంలోనూ, ప్రజలందరికీ సహాయం అందించడంలోనూ ఘోరంగా విఫలమయ్యారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు, విధాన లోపాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

భయం అంచునే బుడమేరు బాధితులు...

ఏడాది తరువాత కూడా బుడమేరు ముంపు భయం ఆయా ప్రాంత ప్రజలను వెంటాడుతూనే ఉంది. ఇటీవల ఎడతెరపి లేని వర్షం పడినపుడు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యల పేరుతో విజయవాడలో కొన్ని ప్రాంతాల్లో పడవలను ఉంచింది. దీంతో వరదొస్తుందని ఆందోళన చెందిన వేలాదిమంది ఇళ్లలోని సామగ్రిని సర్దుకుని పైఅంతస్థుల్లో తలదాచుకున్నారు. వృద్ధులు, పిల్లలను సురక్షిత ప్రాంతాలను



తరలించారు. వాహనాలను బయట ప్రాంతాలకు తరలించేశారు. అయినా పాలకులకు చీమ కుట్టినట్టు లేదు.

ప్రజల కష్టం కానని 'విజన్'!

ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ అంటూ ఊదరగొడు తుంటారు. 2047 గురించి ప్రణాళికలు రూపొందిస్తారు. కానీ బుడమేరు ముంపుతో జన జీవనం అస్తవ్యస్తమై ఏడాది గడిచినా, సమస్యకు శాశ్వత పరపరిష్కార చర్యలు చేపట్టరు. ముంపు నివారణకు అధికారులు ఎన్నో నివేదికలిచ్చారు. అవన్నీ ఏమయ్యాయో ముఖ్యమంత్రికే తెలియాలి.

బనకచర్ల సరే.. ఇక్కడ రక్షణ మాటేమిటి?

80 వేల కోట్ల రూపాయలతో బనకచర్ల లాంటి ప్రాజెక్టులు చేపడతామని ఉత్సాహం చూపుతున్న ముఖ్యమంత్రి బుడమేరు వరద ముంపు నుండి ప్రజలను కాపాడటానికి తక్షణమే తీసుకోవలసిన దీర్ఘకాలిక చర్యల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. బుడమేరు ముంపు సమస్య తలెత్తకుండా సమాంతరంగా మరొక కాలవ తవ్వాలని, రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని, కృష్ణా నదిలో కలిసే డైవర్షన్ చానల్ లోతు పెంచాలని, దిగువన కొల్లేరు వరకు చానల్ వెడల్పు చేయాలని అధికారులు అనేక నివేదికలు రూపొందించారు. గతంలో గండి పడిన ఒక ప్రాంతంలో సుమారు రూ.30 కోట్లు ఖర్చు పెట్టి గోడ కట్టి, శాశ్వత చర్యలు పూర్తయినట్లు ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఐదు వేల కోట్లు రూపాయలు తక్షణమే కేటాయించినా పనులు ప్రారంభమవుతాయి. అదీ లేదు. బడ్జెట్లో నిధులే కేటాయించలేదు.

బుడమేరు వరద బీభత్సానికి ఏడాది

వరద బీభత్సాన్ని కళ్లతో చూసిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా నివారణ చర్యలు చేపట్టలేదు. టిడిపి ప్రజాప్రతినిధులు సొంత సంపాదన చూసుకుంటున్నారే తప్ప నీళ్ళల్లో కాళ్ళు పెట్టలేదు. విజయవాడ నగరపాలక సంస్థలో వైసిపి పాలక పక్షంగా ఉన్నా, వరద సమయంలోనే కాదు. అంతకు ముందు, ఇప్పుడూ కూడా చేసిందేమీ లేదు. కేంద్రంలోని బిజెపి మంత్రులు పర్యటనలు తప్ప, చేసిందేమీ లేదు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యత నిర్వహించాలి. వైసిపి తన బాధ్యత నుండి తప్పించుకోలేదు.

కేంద్రానిదీ అదే వరస

బుడమేరు ముంపు నివారణకు, తక్షణ చర్యలకు రూ. 6,880 కోట్లు సహాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు, ప్రధాని మోడీని కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. ఏడాది గడిచింది. నయాపైసా విడుదల కాలేదు. డబుల్ ఇంజన్ సర్కారుగా చెప్పుకునే ఎన్డీఏ ప్రభుత్వం నిధులు రాబట్టడంలోనూ విఫలమయ్యింది.

సహాయం అందించడంలోనూ వైఫల్యం

వరదల్లో తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం లోనూ ప్రభుత్వం విఫలం అయింది. ఆ విపత్తుకు ఎందరో చలించిపోయారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్రం లోపల, బయట నుండి దాతలెందరో మానవత్వంతో స్పందించారు. రూ. 600 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చారు. వాటితో ప్రభుత్వం బాధితులకు ప్యాకేజీలు ప్రకటించింది. కానీ అవి సగం మందికి అందనేలేదు. నష్టపోయినవారెందరో సహాయమందక రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. చివరి బాధితుడి వరకు సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాట నీటి మూటే అయింది.

ఎవరి లెక్కలు వారివి...

మరోవైపు వరదల్లో రూ.368 కోట్లు ఆహారానికి, రూ.26 కోట్లు మంచి నీటికి, రూ.23 కోట్లు కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు, ఇతర ఖర్చులకు..దాదాపు రూ.534 కోట్లకు పైగా ఖర్చయిందట. ఇది రెవెన్యూ శాఖ అధికారిక నివేదిక వెల్లడించిన లెక్క. దీనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం ఖండించడం తప్ప విచారణ చేపట్టిందీ లేదు. చర్యలు తీసుకున్నదీ లేదు. కొందరు నేతలు, ఉన్నతాధికారులు వరదలను సైతం తమ సొంత సంపాదనకు వినియోగించుకున్నారంటే ఇంతకంటే ఘోరం మరొకటి ఉండదు. సంక్షోభాన్ని సానుకూలంగా వాడుకోవటం అంటే ఇదేనేమో.

టెక్నాలజీ ఏమైంది? అన్నింటా వైఫల్యాలే. నివాస ప్రాంతాల్లోకి వరద వచ్చి పడుతుంటే కనీస హెచ్చరికలు లేవు. సహాయం విషయంలోనూ అదే వైఫల్యం. ఇళ్లు మునిగిపోయినట్లు ప్రత్యక్షంగా కనిపిస్తున్నా మ్యాపింగ్‌లో లేదని పలువురికి సహాయం అందించలేదు. రియల్ టైమ్ గవర్నెన్స్, వాట్సాప్ గవర్నమెంట్ అంటూ సాంకేతిక పరిజ్ఞానం గురించి పదేపదే మాట్లాడే పాలకులు ప్రజలను ఆదుకోవడానికి ఈ టెక్నాలజీని ఎందుకు వినియోగించలేక పోయింది?

వైఫల్యాలు లేని ప్రణాళికలు కావాలి

వరదలు ముంచెత్తినపుడు ప్రకృతి వైపరీత్యం మనమేమీ చేయలేమని పాలకుల చేతులెత్తేస్తారు. పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా అకస్మాత్తుగా కురుస్తున్న భారీ వర్షాలు నగరాలను ముంచేత్తుతున్నాయి. దేశంలోని అనేక ముఖ్య నగరాల్లో ఈ సమస్య తలెత్తుతోంది. స్మార్ట్ సిటీలు, అమృత్ నగరాలు వంటి పథకాలను రూపొందించే పాలకులు భారీ వర్షాలు, వరదల నుండి ప్రజలను కాపాడే పథకాలను మాత్రం రూపొందించరు. పట్టణ ప్రణాళికలు, వ్యవస్థల్లోని వైఫల్యాలను గుర్తించి సరిదిద్దుకున్ననాడు చాలా సమస్యలు పరిష్కారమవుతాయి.

అభివృద్ధికీ దెబ్బ

పాలకులు రోజూ అభివృద్ధి మంత్రం జపిస్తుంటారు. అభివద్ధికీ, ప్రకతి వైపరీత్యాలకూ సంబంధం ఉంది. వరద ముంపు కారణంగా విజయవాడలో విస్తరిస్తున్న ప్రాంతాల్లో అభివద్ధి కుంటుపడుతోంది. వరద భయంతో కొన్ని ప్రాంతాల్లో ఇళ్ళు కట్టుకోవటానికి ప్రజలు ముందుకు రావడం లేదు. పరిశ్రమలు, వ్యాపారాలు కోలుకోలేదు. వరద నివారణకు చేపట్టే శాశ్వత చర్యలే నగరాన్ని అభివృద్ధి బాట పట్టిస్తాయనే వాస్తవాన్ని గుర్తించి ప్రణాళికలు రూపొందించాలి.

విమర్శలు కాదు.. చేతల్లోకి దిగాలి.

వరద పాపం మీదంటే మీదంటూ పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి అధికార టిడిపి, ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి. తన హయాంలో ముంపు గోడును వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. వరద బీభత్సాన్ని కళ్లతో చూసిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా నివారణ చర్యలు చేపట్టలేదు. టిడిపి ప్రజాప్రతినిధులు సొంత సంపాదన చూసుకుంటు న్నారే తప్ప నీళ్ళల్లో కాళ్ళు పెట్టలేదు. విజయవాడ నగరపాలక సంస్థలో వైసిపి పాలక పక్షంగా ఉన్నా, వరద సమయంలోనే కాదు. అంతకు ముందు, ఇప్పుడూ కూడా చేసిందేమీ లేదు. కేంద్రంలోని బిజెపి మంత్రులు పర్యటనలు తప్ప, చేసిందేమీ లేదు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యత నిర్వహించాలి. వైసిపి తన బాధ్యత నుండి తప్పించుకోలేదు.

అప్పుడూ, ఇప్పుడూ ప్రజలకు అండగా...

వరద ముంచెత్తిన సమయంలోనూ, ఆ తరువాత కూడా సిపిఎం, ప్రజా సంఘాలు ప్రజలకు అండగా నిలిచాయి. అభ్యుదయవాదులు చేయందించగా, నాడు వరదలో చిక్కుకున్న ప్రజలకు సహాయమందించేందుకు ప్రభుత్వ వ్యవస్థలు చేరుకోలేని ప్రాంతాలకు సైతం వలంటీర్లు వెళ్లి ఆదుకున్నారు. 15 చోట్ల భోజన శిబిరాలు ఏర్పాటు చేసి లక్షా 75 వేల మందికి అక్కడికక్కడే భోజనాలు వండించి, అందించి బాధితుల, ప్రజల మన్ననలను పొందారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సైతం సిపిఎం కేంద్రాల్లో భోజనాలు చేశారంటే ప్రభుత్వ వైఫల్యం, సిపిఎం కృషి స్పష్టం అవుతుంది. బాధితుల సహాయం కోసం నాడు సిపిఎం అనేక ఆందోళనలు చేసింది. సంవత్సరం పూర్తయినా శాశ్వత చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని నేడు ఉద్యమాన్ని ప్రారంభించింది. ప్రజల ఒత్తిడి లేనిదే పాలకులు నోరు మెదపరు. ఈ సమస్యపై పౌర సమాజం ఐక్యం కావాలి. తక్షణ సహాయంతో పాటు బుడమేరు ముంపు నివారణ శాశ్వత చర్యల కోసం ఉద్యమించాలి. ఈ సమస్యపై ప్రజా ప్రతినిధులను నిలదీయాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు /

నాడు విద్యావెలుగు.. నేడు సమస్యల నెలవు.!

- కొడిగెనహళ్లి ఎపిఆర్‌జెసిలో వసతులలేమి
- శిథిలావస్థలో భవనాలు
- 300 మంది విద్యార్థులకు ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి
- సిఎస్‌ఆర్ నిధులతో పూర్వ వైభవం వచ్చేనా..?
- ప్రభుత్వ తోడ్పాటు అందిస్తే మరింత ఉపయోగం



ప్రజాశక్తి-పరిగి (అనంతపురం)

హిందూపురం నియోజకవర్గం పరిగి మండలం కొడిగెనహళ్లి ప్రాంతంలో ఎపిఆర్‌జెసి జూనియర్ కళాశాలను 1989 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ. 60 లక్షలతో నిర్మించింది. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో విద్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మూడు దశాబ్దాల పాటు ఈ కళాశాల ఒక వెలుగు వెలిగింది. ఇప్పుడు ఈ కళాశాలలో ఇంటర్‌లో సీటు కోసం చాలా మంది విద్యార్థులు తపన పడుతుంటారు. అలాంటి కళాశాల పాలకుల నిర్లక్ష్యంతో రానురాను దాని ప్రాభవాన్ని కోల్పోతోంది. ఏడాదికేడాది నిధుల కేటాయింపు తగ్గిపోతుండడంతో దీని నిర్వహణ భారం అవుతోంది. 300 మంది విద్యార్థులున్న ఈ కళాశాలకు కేవలం ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకరు మినహా మిగిలినవారంతా తాత్కాలిక ఉపాధ్యాయులు(గెస్ట్‌ఫ్యాకల్టీలు)తో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.

కదిలించిన నాటి విద్యా వెలుగులు..!

దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఎపిఆర్‌జెసి ఉంది. ఇందులో చదివిన విద్యార్థులు అనేక మంది అటు చదువులో ఇటు ఆటల్లో రాణించి దేశ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు సంపాదించి ఉన్నత శిఖరాలు అధి రోహించారు. ప్రస్తుతం ఈ కళాశాలను పలు సమస్యలు వెంటాడు తున్నాయి. సుమారు 300 మంది విద్యార్థులు ఇక్కడ చదవుతు న్నారు. వీరందరికీ ప్రధానా చార్యులు తప్ప మిగిలా బోధనా సిబ్బంది 17 మంది తాత్కాలిక ఉపాధ్యాయులు (గెస్ట్ ఫ్యాకల్టీ)గా పని చేస్తున్నారు. వారికి కూడా చాలీచాలని వేతనం వస్తోంది. అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి వారికి అందుతోంది. ఇక విద్యార్థులకు భోజనం విషయం మరింత దారుణంగా ఉంది. ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే వంట మనుషులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కూడా ఒక్కొక్కరు రెండు మూడు రోజులు సెలవు తీసుకునే పరిస్థితి ఉంది. కళాశాలకు వంట మనుషుల కేటాయింపు విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. పాఠశాల సమయానికి భోజన సదుపాయం కల్పించలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ నాలుగు గ్రూపులతోనే సరి

ఇంటర్మీడియట్ విద్యకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో నాలుగు గ్రూపులు మంజూరు చేశారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల ద్వారా విద్యాబోధన జరుగుతోంది. మారిన టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నూతన గ్రూపులను కళాశాలకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో ప్రయివేటు విద్యాసంస్థలు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా కళాశాలలను అభివృద్ధి చేసుకుని ముందుకుపోతున్నాయి. ఇలాంటి సమయంలో గత చరిత్ర ఎంతో ఘనంగా ఉన్నా ఎపిఆర్‌జెసి ఇలా దీనస్థితికి చేరుకోవడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న సౌకర్యాల కొరత

36 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కళాశాల భోజన తయారీ భవనం శిథిలావస్థలో ఉంది. నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరం. విద్యార్థులు భోజనం చేసేందుకు కూడా సరైన వసతులు లేక పూర్వ విద్యార్థులు సహకారంతో నిర్మించిన ఓ రేకుల షెడ్డులో భోజనం చేస్తున్నారు. అక్కడ కూడా సరైన వసతి సౌకర్యాలు లేవు. ఈ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి 36 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ ఏ ఒక్క నూతన భవనం ఏర్పాటు చేయలేదు.

సిఎస్‌ఆర్ నిధులతోనైనా పూర్వ వైభవం వచ్చేనా..?

కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ జూనియర్ కళాశాల అభివృద్ధికి కియా పరిశ్రమ నిర్మాణాలకు నిధులు కేటాయిస్తుండటంతో సిఆర్‌ఎస్ నిధుల ద్వారా పూర్వవైభవం వచ్చేనా అన్న ఆశలు కలుగుతున్నాయి. పెనుగొండ కేంద్రంగా ఏర్పాటు చేసిన కియా పరిశ్రమ యాజమాన్యం రూ.2.86 కోట్ల రూపాయల మేరకు నిధులు కేటాయించింది. దీని ద్వారా కళాశాలలో రెండు డార్మెటరీ భవనాల ఏర్పాటు తోపాటు డైనింగ్ హాల్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నిధులకు తోడు ప్రభుత్వం కూడా అవసరమైన నిధులను విడుదల చేసి శిథిలావస్థల్లో ఉన్న తరగతి గదుల మరమ్మతులు చేయడం, సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాల్సిఉంది. తేవాల్సిన అవసరం ఉందనిపలువురు కోరుతున్నారు.

సబ్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు పరార్

- చోడవరం జైలు వార్డర్‌పై సుత్తితో దాడి

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి)



గాయపడ్డ వీర్రాజు

అనకాపల్లి జిల్లా చోడవరం సబ్‌జైలు వార్డర్‌పై సుత్తితో దాడి చేసి ఇద్దరు ఖైదీలు పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వంటకు సాయం చేసేందుకు శుక్రవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో ఖైదీలను వారి గదుల్లోంచి బయటకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో చోరీ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బెజవాడ రాము.. వార్డర్ వీర్రాజు తలపై సుత్తితో దాడి చేశాడు. అనంతరం, వార్డెర్ వద్దనున్న తాళాలు తీసుకుని లాక్ ఓపెన్ చేసి పరారయ్యాడు. పింఛను సొమ్ము కాజేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న నక్క రవికుమార్ ఇదే అదునుగా భావించి రామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు నటించి అతనూ పరారయ్యాడు. ఈ విషయమై జైలు అధికారులు చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జేన్ స్ట్రీట్‌పై సెబీ దర్యాప్తు ప్రారంభం

ముంబయి : అమెరికా ట్రేడర్ అయిన జేన్ స్ట్రీట్‌పై సెబీ లాంఛనంగా దర్యాప్తు చేపట్టింది. స్టాక్, బాండ్ మార్కెట్ అవకతవకలపై తరచుగా ఫిర్యాదులు రావడం, తొలి దర్యాప్తులోని డేటాపై సందేహాలు నెలకొన్న నేపథ్యంలో నిఘా విభాగం ఈ అంశాన్ని మూసేయాలని సిఫార్సు చేసినప్పటికీ సెబీ దర్యాప్తు ప్రారంభించింది.

ఈ ఏడాది జులై 4న జేన్ స్ట్రీట్‌ను భారత మార్కెట్ల నుండి సెబీ నిషేధించింది. 567 మిలియన్ల డాలర్ల మేరకు పెనాల్టీ కూడా విధించింది. ఆ మొత్తాన్ని కంపెనీ ఇప్పటికే డిపాజిట్ చేసింది. కానీ ఈ సంస్థ భారత్‌లో తన ట్రేడింగ్‌ను పునరుద్ధరించలేదు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 3న జేన్ స్ట్రీట్, సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎస్‌ఎటి) ముందు ఒక అప్పీల్ దాఖలు చేసింది. లాంఛనంగా దర్యాప్తు చేపట్టడానికి గానూ అవసరమైన డాక్యుమెంట్లు, డేటా ఇవ్వాలని సెబీ కోరడంపై ఫిర్యాదు చేసింది. నిఘా విభాగం స్వయంగా సూచనలు జారీ చేసినా సెబీ ఎందుకు దర్యాప్తు చేస్తుందని ప్రశ్నించింది. ఈ అప్పీల్‌పై 8వ తేదీ విచారణ జరగాల్సి వుంది. అయితే ఆ రోజు ఈద్ కాబట్టి మంగళవారం 9వ తేదీన విచారణ జరగనుంది.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోండి

- ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 10 మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు.

గజరాజుల దాడి - పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీలో శుక్రవారం తెల్లవారు జామున వ్యవసాయ పంటలపై ఏనుగులు దాడిచేసి విధ్వంసం సృష్టించాయి. పాతపేట గ్రామానికి చెందిన సోమశేఖర్, నారాయణ, శంకర, సురేష్, జయమ్మ తదితర రైతులకు చెందిన వేరుశనగ, టమోటా, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లను తొక్కి ధ్వంసం చేశాయి. రైతుల వ్యవసాయ మోటారు పంపులు, డ్రిప్ పైపులను తొక్కి నాశనం చేశాయి.

పన్ను ఎగవేత అభియోగాల నేపథ్యంలో..
బ్రిటన్ ఉప ప్రధాని రాజీనామా



లండన్ : పన్ను ఎగవేత అభియోగాల నేపథ్యంలో బ్రిటన్ ఉప ప్రధాని ఏంజెలా రేనర్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఒక ఇల్లు కొనుగోలు చేసిన విషయంలో.. మంత్రులు పాటించవలసిన నైతిక ప్రమాణాలను ఆమె పాటించలేదని స్వతంత్ర దర్యాప్తులో వెల్లడైంది. వేసవికి ముందు ఇంగ్లండ్‌లోని దక్షిణ తీర ప్రాంతంలోని హోవ్‌లో ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినపుడు తగిన పన్ను చెల్లించలేదని ఆమె బుధవారం అంగీకరించారు. తాను మంచిగా విశ్వసనీయతతోనే వ్యవహరించానని విచారణా నివేదిక పేర్కొందని, కానీ పన్ను విషయంలో మరింత నిర్దిష్టంగా వ్యవహరించడం కూడా కీలకమని భావించిందని చెప్పారు. జరిగిన పొరపాటుకు పూర్తి బాధ్యత వహిస్తున్నానని చెబుతూ ఆమె తన రాజీనామా లేఖను ప్రధాని కెయిర్ స్టార్మర్‌కు పంపించారు. దీనిపై ప్రధాని విచారం వ్యక్తం చేస్తూ, అయితే రేనర్ సరైన నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. నీతి నిజాయితీలతో రేనర్ వ్యవహరించినా, ప్రజా సేవ పట్ల అద్భుతమైన నిబద్ధతను కనబరిచినా, మంత్రుల నైతిక ప్రవర్తనా నియమావళిని ఆమె ఉల్లంఘించడం విచారకరమని స్వతంత్ర దర్యాప్తు చేపట్టిన లారీ మాగ్నస్ వ్యాఖ్యానించారు.

ప్రీతి కుటుంబాన్ని బెదిరించిన వారిపై కఠిన చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రీతి కుటుంబ సభ్యులను బెదిరించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబం న్యాయం కోసం ప్రశ్నిస్తే కులం పేరిట హేళన చేసిన జనసేన పార్టీ నాయకుడు గాదె వెంకటేశ్వరరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీతి వసతి గృహంలో చనిపోతే, పోస్ట్ మార్టంలో అత్యాచారం, హత్యగా స్పష్టమైనా, విచారణలో సాక్ష్యాలను మాయం చేశారని పేర్కొన్నారు. సాక్ష్యాలను మాయం చేసిన వారిని విచారించకుండా, బాధితులకు భూమి ఇచ్చామని, నష్టపరిహారం ఇచ్చామని, ఉద్యోగం ఇచ్చామని, వాటిని తిరిగి ఇచ్చేయాలని కోరే హక్కు నాయకులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

ఎరువుల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎరువుల కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును విజయవాడలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల యజమానులు యూరియా కావాలంటే అవసరం లేని కొన్ని ఎరువులను అంటగట్టి రైతులపై అదనపు భారాలు వేస్తున్నారని పేర్కొన్నారు. యూరియా, డిఎపి ఎరువులు అందక రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కృష్ణా జిల్లాలో యూరియా బస్తాపై అధికంగా రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారని, డిఎపి బస్తాపై రూ.200 నుంచి రూ.250 వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఐ రాష్ట్ర జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ ఉన్నారు.

సిట్ విచారణలో వైఎస్ అనిల్‌రెడ్డి పిఎ

- కీలక వివరాలు రాబట్టినట్లు సమాచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాజకీయ దుమారం లేపుతున్న మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు పెంచింది. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి పిఎగా పనిచేస్తున్న దేవరాజును శుక్రవారం విజయవాడలో సిట్ విచారించింది. ఇతనిని కేసులో సాక్షిగా పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారా లేక నిందితునిగా చేర్చారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. రెండు రోజులుగా చిత్తూరు జిల్లాలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విజయానందరెడ్డి సంస్థలు, నివాసాల్లో సోదాలు నిర్వహించిన సిట్ బృందం పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దేవరాజును సిట్ విచారిస్తున్నట్లు సమాచారం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పలు అంశాల్లో వైఎస్ అనిల్‌రెడ్డి జోక్యం ఉందని, మద్యం కుంభకోణంలో కూడా ఆయన పాత్ర ఉండొచ్చని సమాచారం.

టిటిడికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - తిరుమల

బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరుకు చెందిన ఓ అజ్ఞాత యాత్రికుడు శుక్రవారం రూ.1,00,50,000 (ఒక కోటి యాభై వేల రూపాయలు)ను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత విరాళం డీడీని తిరుమలలోని టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు అందజేశారు.

5న భక్త కనకదాస కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

భక్త కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణ అక్టోబర్ 5వ తేదీ తిరుపతి బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం కూడలి వద్ద జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనకదాసవిగ్రహ కమిటీ కన్వీనర్ వెంకటప్ప, కో కన్వీనర్ మంగిరి రెడ్డప్ప కోరారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ వారి తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని అందిస్తున్నారు.

టీమిండియా ప్రాక్టీస్ షురూ!

దుబాయ్: ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా ఆటగాళ్లు శుక్రవారం నుంచి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. సూర్యకుమార్ సారథ్యంలోని భారతజట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే. దుబాయ్ చేరిన వారిలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, రింకూ సింగ్, హర్షిత్ రాణా, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, సంజూ సాంసన్ ఉన్నారు. అలాగే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా దుబాయ్‌లోనే ఉన్నారు. తొలి ప్రాక్టీస్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఐసిసి అకాడమీలో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. బిసిసిఐ సూచనలమేరకు భారత్‌లో ప్రాక్టీస్ క్యాంప్‌ను రద్దు చేసి, నేరుగా దుబాయ్‌లోనే ఆటగాళ్లు ఐసిసి అకాడమీలో ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. ఆసియా కప్‌ను ఎనిమిది సార్లు గెలిచిన భారత్.. ఈసారి తొమ్మిదోసారి కప్‌ను సొంతం చేసుకోవాలని చూస్తోంది. టీమిండియా తొలి మ్యాచ్‌లో 10న యుఎఇతో తలపడనుంది.

ప్రభావం చూపని జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు

ముంబయి : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల తగ్గింపు మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపలేకపోతోంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలు, అమెరికా టారిఫ్‌ల భయాలు ఇప్పటికీ ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. జిఎస్‌టి శ్లాబులను 5, 12 శాతాలకు తగ్గించడం ద్వారా మార్కెట్లు పరుగులు పెడతాయని ప్రభుత్వ వర్గాలు ఊహించినప్పటికీ.. ఆచరణలో భిన్నంగా ట్రేడింగ్ అవుతోన్నాయి. గురువారం, శుక్రవారం సెషన్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పడిపోతూ చరిత్రలోనే ఎప్పుడూ లేని కనిష్ట స్థాయి 88.27కు దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు మిశ్రమంగా నమోదయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 7.25 శాతం తగ్గి 80,710.76 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 24,641 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ సెన్సెక్స్ 150 పాయింట్ల ర్యాలీతో సరిపెట్టుకుంది.

వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 0.20 శాతం, స్మాల్ క్యాప్ 0.19 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగం 1.125 శాతం, లోహ రంగం 0.68 శాతం, మీడియా 0.59 శాతం చొప్పున పెరగ్గా.. ఐటి రంగం ఏకంగా 1.44 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఎఫ్‌ఎంసిజి 1.42 శాతం, రియాల్టీ 1.16 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.



ధవళేశ్వరం కాటన్‌బ్యారేజీవద్ద సముద్రంలోకి విడుదలవుతున్న వరద నీరు



వరద తగ్గడంతో ఇళ్లకు చేరుకుంటున్న అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం వడ్డిగూడెం గ్రామస్తులు

గోదావరి తగ్గుముఖం

ధవళేశ్వరం వద్ద 11.20 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. గురువారం 43 అడుగులకు చేరిన ప్రవాహం శుక్రవారానికి 38 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ప్రస్తుతం 11.20 అడుగుల నీటిమట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 9,00,814 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి వరద తగ్గడంతో ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజేవేలు ముంపు నుండి బయటపడడంతో రాకపోకలు మొదలయ్యాయి. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

విఆర్.పురం మండలంలో ఇళ్లను విడిచి ఎత్తైన గుట్టలు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిన వారిలో కొంతమంది తిరిగి గ్రామానికి వస్తున్నారు.

పలు గ్రామాల రహదారులపై నేటికీ నీరు నిలిచే ఉంది. రెక్కాడితేగానీ డొక్కాడని తామంతా వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని రోజులుగా ఉపాధి లేకుండా పోయిందని పలువురు బాధితులు వాపోతున్నారు.

ముంపునకు గురైన విఆర్.పురం మండలంలోని వడ్డిగూడెం, రామవరం గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి పర్యటించారు.

పోలవరం నుంచి 9,09,840 క్యూసెక్కులు విడుదల

పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,09,840 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.280 మీటర్లు, స్పిల్ వే దిగువన 23.600 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 32.900 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 23.210 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.040 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

జగన్ అసెంబ్లీకి రాకపోతే పులివెందులకు బై ఎలక్షన్ ఖాయం

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మాజీ సిఎం జగన్ వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని, లేనిపక్షంలో పులివెందులకు బై ఎలక్షన్ ఖాయమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయని తెలిపారు. జగన్ ప్రతిపక్ష హోదా కోసం మారాం చేయడం తగదని వ్యాఖ్యానించారు. జగన్ 60 రోజులు అసెంబ్లీ సమావేశాలకు రాకపోతే ఆటోమేటిక్‌గా డిస్‌క్వాలిఫై అయిపోతారని తెలిపారు. ఎమ్మెల్యేలు శాసనసభా సమావేశాలను బహిష్కరిస్తే ఆ పదవికి అర్హత లేనట్లుగానే భావించాలన్నారు. జగన్‌తోపాటుగా ఎమ్మెల్యేలు సైతం అసెంబ్లీకి హాజరు కాకుంటే వైసిపి గెలిచిన 11 స్థానాలకూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయని వ్యాఖ్యానించారు.

చోరీ చేసి.. మళ్లీ తెచ్చిపెట్టి..

- హుండీని నగదుతో సహా ఆలయంలో పడేసిన నిందితులు

బుక్కరాయసముద్రం : ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని చోరీ చేసిన నిందితులే తిరిగి నగదుతోపాటు హుండీని ఆలయంలో ఉంచిన ఘటన శుక్రవారం మండల కేంద్రం సమీపంలోని ముసలమ్మ ఆలయంలో చోటు చేసుకుంది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం పంచాయతీలోని ముసలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని గుర్తు తెలియని దుండగులు నెలరోజుల క్రితం చోరీ చేశారు. అయితే గురువారం రాత్రి తిరిగి చోరీ చేసిన హుండీని నగదుతో సహా ఆలయ ఆవరణలో పడేసి వెళ్లారు. ఉదయం గమనించిన ఆలయ పూజారులు, అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో ధర్మకర్త సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ కేసన్న, మాజీ సర్పంచు నారాయణస్వామి ఆధ్వర్యంలో హుండీలోని నగదును లెక్కించారు. అయితే అదే హుండీలో 'మేము నలుగురు వ్యక్తులము హుండీని చోరీ చేశామని, హుండీని ఎత్తుకెళ్లినప్పటి నుంచి మా ఇళ్లల్లో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీంతో భయపడి అమ్మవారి ఆలయంలోనే హుండీని వదిలేసి వెళ్తున్నాం..' అంటూ లేఖ రాసి ఉండటం గమనార్హం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ కార్మికుల వెతలు తీరేదెన్నడో?

- 2013 భూసేకరణ చట్టం అమలుకు నోచని వైనం
- కడపలో 8, 9, 10వ తేదీల్లో వ్య.కా.స జాతీయ కౌన్సిల్ సమావేశాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు సమస్యల వలయంలో కూరుకుపోయారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాయలసీమ జిల్లాలో సోలార్, విండ్, హైడ్రో పంప్డ్ స్టోరేజీ పరిశ్రమలకు పెద్దఎత్తున రైతుల భూములను ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా భూములు కోల్పోయిన రైతులు కూడా వ్యవసాయ కార్మికులుగా మారిపోతున్నారు. కడపలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ నిర్వహిస్తోంది. వ్యవసాయ కార్మికుల సమస్యలపైనా చర్చించడం, ప్రణాళికలు రూపొందించడం, అమలుకు గల అవకాశాలపై దృష్టి సారించే అంశాలను ఈ కౌన్సిల్‌లో చర్చించనున్నారు.

రాయలసీమలో అధికాంగా వరి, వేరుశనగ, పత్తితోపాటు పెద్దఎత్తున ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. పరిశ్రమల పేరుతో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భాగంగాకార్పొరేట్లకు టిడిపి కూటమి సర్కారు లక్షలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసింది. ఫలితంగా 50 లక్షల మందికి ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది మరో ఐదు లక్షల ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని లక్ష్యంగా పెట్టుకోవడంతో 1.50 కోట్ల మందికి ఉపాధి గల్లంతు కానుంది. భూములను కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడం లేదు. కడప, కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో భూములు ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు, స్థానికులకు మధ్య ఘర్షణ నెలకొంది. స్థానికుల పోరాటాలకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలిచింది. 70 వేల ఎకరాలను ఆక్రమించిన ఆక్రమణదారులతో వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యక్షంగా పోరాడుతోంది. ఇలాంటి తరహా పోరాటం కడప జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో సాగుతోంది. ఆక్రమణదారులతో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం నేపథ్యంలో పోరుమామిళ్లకు చెందిన వెంబడి పోలయ్యపై ఆక్రమణదారులు దాడికి సైతం తెగబడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉధృత పోరాటం నేపథ్యంలో కడప జిల్లాలోనే 450 మందికి భూములు పంపిణీ చేయడం జరిగింది. చిత్తూరు జిల్లా కుప్పం ఎయిర్‌పోర్టు, కడప జిల్లాలోని ఎర్రగుంట్ల, ముద్దనూరు నుంచి కర్నూలు జిల్లాలోని శకునాల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేస్తోంది. రాయలసీమ నుంచి అనేక మంది ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ సామాజిక వివక్ష కొనసాగుతోంది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని, పనుల ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని, ఉచిత విద్య, వైద్యం కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతోంది.

జగదీశన్ డబుల్ సెంచరీ మిస్

- సౌత్‌జోన్ 536/10
- దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్



బెంగళూరు: దులీప్ ట్రోఫీ-2025 సెమీఫైనల్లో సౌత్‌జోన్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ తృటిలో డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. నార్త్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో రెండోరోజు జగదీశన్(197) రనౌటయ్యాడు. రికీబుయ్(54), త్యాగరాజన్(58) అర్ధసెంచరీలతో రాణించడంతో సౌత్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 536పరుగుల భారీస్కోర్ చేసింది. సౌత్ జోన్ ఓపెనర్, తమిళనాడు స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ నారయణ్ జగదీశన్ డబుల్ సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఔటయ్యాడు. 148 పరుగులతో రెండో రోజు బ్యాటింగ్‌ను కొనసాగించిన జగదీశన్.. సునాయసంగా డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకునేలా కన్పించాడు. కానీ 197 పరుగుల వ్యక్తిగత స్కోర్ నార్త్ జోన్ ఆటగాడు నిశాంత్ సింధు అద్భుత త్రోకు బలయ్యాడు. జగదీశన్ ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. నార్త్‌జోన్ బౌలర్లు నిషాంత్ సింధుకు ఐదు, కంబోజ్‌కు రెండు, దగర్, లోత్రాకు ఒక్కో వికెట్ దక్కాయి.

సెంట్రల్‌జోన్ 229/2

వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో సెంట్రల్ జోన్ జట్టు బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. మలేవార్(76), శుభమ్ శర్మ(60నాటౌట్)కి తోడు కెప్టెన్ రజత్ పటీధర్(47నాటౌట్) బ్యాటింగ్‌లో మెరిసారు. దీంతో ఆ జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి 2 వికెట్ల నష్టానికి 229పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 363పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన వెస్ట్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 438పరుగులకు ఆలౌటైంది. గైక్వాడ్(184) సెంచరీకి తోడు తనుష్ కోటియన్(76), శార్దూల్ ఠాకూర్(64) అర్ధసెంచరీలతో రాణించారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు నరాన్ష్ జైన్, హర్ష్ దూబేకు మూడేసి, ఖలీల్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. వెస్ట్‌జోన్ జట్టు ఇంకా 209పరుగులు వెనుకబడి ఉంది.

లెవిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా అలియా భట్



హైదరాబాద్ : ప్రముఖ ఫ్యాషన్ ఉత్పత్తుల కంపెనీ లెవీస్ తన గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటి అలియా భట్‌ను నియమించుకుంది. లెవిస్‌కు చెందిన డెనిమ్ ఉత్పత్తులకు ప్రచారం కల్పించనుందని ఆ సంస్థ పేర్కొంది. డెనిమ్ ఫ్యాషన్‌లో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి, లూజ్ ఫిట్స్, వైడ్ లెగ్ స్టైల్స్‌తో కొత్త తరం ధోరణులను ప్రోత్సహిస్తూ బ్రాండ్‌ను మరింత స్టైల్ ఫార్వర్డ్‌గా మార్చడానికి అలియా ప్రచారం దోహదం చేయనుందని ఆ కంపెనీ తెలిపింది.

'తరువాత' ఎవరు..?

- 'సిట్' విచారణతో 'వైసిపి'లో గుబులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎపి లిక్కర్ స్కాం కేసులో సిట్ దూకుడు పెంచింది. రూ.3,500 కోట్లకు పైగా స్కాం జరిగినట్లు గుర్తించిన సిట్ అధికారుల దర్యాప్తులో పలువురు జైలుపాలవుతున్నారు. ఇప్పటికే ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డితో పాటు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప ఈ కేసులో అరెస్టు అయ్యారు. పోలీసుల కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. వీరితో పాటు మరో 39 మంది వరకూ సిట్ నిందితులుగా చేర్చింది. ఈ నేపథ్యంలో 'తరువాత' అరెస్టు ఎవరన్నది జిల్లాలో వైసిపి శ్రేణుల్లో రాజకీయ విభాగాల్లో చర్చ నడుస్తోంది. వైసిపిలోని కొందరు సీనియర్లు సైతం ఈ జిల్లాలో ఎవరెవరికి లిక్కర్ స్కాంలో లింకులు ఉన్నాయని ఆరా తీస్తుండటం గమనార్హం. చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు అరెస్టు అయ్యారు. వారిద్దరి అరెస్టు తరువాత రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అరెస్టు చేసింది. ఇక చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లిక్కర్ కేసులో నిందితుడుగా ఉన్నారు. లిక్కర్ స్కామ్‌లో వచ్చిన ముడుపులను చంద్రగిరి సహా పలు నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో పంచారని అభియోగాలను ఎదుర్కొంటున్నారు. చెవిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బాలాజీతో పాటు కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌లపైనా కేసు నమోదయ్యింది. ఇప్పటికే అరెస్టయ్యి జైల్లో ఉన్న వీరందరినీ సిట్ విచారించింది. ఈ తరుణంలోనే ఎప్పటికప్పుడు కొత్తపేర్లు బయటకు వస్తున్నాయి. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామికి సైతం నెలరోజుల క్రితం ఆయనకు సిట్ నోటీసులు ఇవ్వడంతో అనారోగ్య కారణాల వల్ల వాట్సాప్‌లో పంపిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దానికి సంతృప్తి చెందని సిట్ అధికారులు నేరుగా నారాయణస్వామి ఇంటికి వచ్చి ఆరు గంటలపాటు విచారణ జరిపారు. వైసిపి హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారాయణస్వామి అరెస్టు అవుతారనే ప్రచారం జోరుగా సాగింది. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆయన వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలుస్తోంది. అయితే నారాయణస్వామి మాత్రం 'పైవారు చెబితే చేశా' అని చెప్పుకొచ్చారని సమాచారం. ఆయన ఎవరెవరి పేర్లు చెప్పారనేది సర్వత్రా ఉత్కంఠ.

విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు

ఇక నారాయణ స్వామిని విచారణతో మాత్రమే సరి పెట్టడంతో అందరూ ఉపిరి పీల్చుకున్నారు.. అయితే ఊహించని విధంగా చిత్తూరు వైసీపీ ఇన్చార్జి విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు రావడంతో విచారణకు హాజరయ్యారు. వైసీపీ హయాంలో మద్యం డిపోల నుంచి షాపులకు తరలించేందుకు ఆయన కాంట్రాక్టు పొందారనే సమాచారం. పొరుగు రాష్ట్రాల్లో రవాణా చేసే ట్రాన్స్ పోర్ట్ కంపెనీలకు ఇస్తున్న మొత్తం కన్నా ఎక్కువకు ఈ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో చెవిరెడ్డి సూచనల మేరకు లిక్కర్ ముడుపుల్ని వైసీపీ అభ్యర్థులకు విజయానందరెడ్డి చేరవేసినట్లు సిట్ గుర్తించింది. వీటన్నింటిపై సుదీర్ఘంగా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు టాక్ నడుస్తోంది. అలా జిల్లాలో నగరిలో రోజాకు, తిరుపతి, కాళహస్తి, పూతలపట్టు, పీలేరు, జీడి నెల్లూరుకు అ నగదు చేరవేసినట్లు అనుమానిస్తున్నారంట. వీటిపై ఆయన మొదట తనకు ఏమీ తెలియదని, మద్యం సరఫరా కాంట్రాక్టు మాత్రమే చేశానని బుకాయించారంట. అయితే సిట్ అధికారులు చూపిన ఆధారాలతో గుట్టు విప్పక తప్పలేదంట. విజయానందరెడ్డిని సిట్ అధికారులు మరోసారి విచారణకు రావాలని చెప్పినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాలో వరుసగా వైసీపీ నేతలను సిట్ విచారించడంతో తర్వాత ఏం జరుగుతుందోనని ఆ పార్టీ శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సైతం లిక్కర్ స్కామ్‌లో భాగం ఉందంటూ టిడిపి నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలు జిల్లా వైసీపీలో మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలా రాష్ట్రంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్ గా చెబుతున్న కేసులో వరుసగా చిత్తూరు జిల్లాకు సంబంధించిన నేతలే చిక్కుకోవడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యంపై త్వరలో చర్యలు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో సంభవించిన అసాధారణ మరణాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. శుక్రవారం ఆ గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారుల నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపైనా ఆరా తీశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... మరణాలకు కారణాలపై లోతుగా విశ్లేషిస్తున్నామని, 14 రకాల వైద్య బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జ్వరం బారిని పడినవారందరికీ రక్త పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. మైలోడియోసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు వార్తలొచ్చాయని, పరీక్షల ఫలితాల్లో అటువంటిదేమీ కనిపించలేదన్నారు. కెమికల్, బయోలాజికల్ పరీక్షలు కూడా చేయిస్తున్నామని చెప్పారు. మరణాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావడంలో జరిగిన వైఫల్యాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ప్రభుత్వానికి సిఫార్సు చేసేందుకు ఐఎఎస్ అధికారి డాక్టర్ అట్టాడ సిరి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ స్థాయిలో కంటే మరణాలు అధికంగా ఉన్నప్పుడు అన్ని స్థాయిల్లోని అధికారులకు వెంటనే సమాచారం అందేలా అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడంపై కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలిస్తుందని చెప్పారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై త్వరలోనే చర్యలు ఉంటాయని తెలిపారు.



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అరుదైన వ్యాధి : పెమ్మసాని

తురకపాలెంలో అధిక సంఖ్యలో మరణాలు సంభవించడానికి అరుదైన వ్యాధే కారణమేనని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే బూర్ల రామాజంనేయులుతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాగునీరు వల్ల ఈ వ్యాధి వస్తుందనడం సరైంది కాదన్నారు. అరుదైన వ్యాధి కావడం, ఎవరికి సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పట్టడం వల్ల ఇలాంటి అపోహలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఎవరైతే ఇబ్బంది పడుతున్నారో, వారికి మళ్లీ బ్లడ్ కల్చర్ చేసి సవివరమైన రికార్డులు సేకరించి, అవసరమైన వారిని ఆస్పత్రిలో చేర్చి జాగ్రత్తగా చూసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

గూగుల్‌కు యూరోపియన్ కమిషన్ భారీ జరిమానా

బ్రస్సెల్స్ : యూరోపియన్ కమిషన్ ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ కంపెనీకి 2.95 బిలియన్ యూరోలు (సుమారు 3.06 లక్షల కోట్ల రూపాయలు) భారీ జరిమానా విధించింది. సామాజిక మాధ్యమాల ప్రచురణలు, ప్రకటనదారులకు సంబంధించిన వ్యవహారాల్లో గూగుల్ తన సొంత సేవలకు ప్రాధాన్యతనిచ్చి నిబంధనలు పాటించలేదని, ఇది చట్టానికి వ్యతిరేకమైన పద్ధతని యురోపియన్ యూనియన్ పేర్కొంది. సంస్థ తక్షణమే ఈ అన్యాయమైన పద్ధతులను ఆపాలని, అవసరమైన మార్పులు తీసుకురావాలని గూగుల్‌ను ఆదేశించింది. ఈ నిర్ణయంతో గూగుల్ తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేస్తూ, ఈ జరిమానా "అన్యాయమైనది" అని తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ఐరోపాలోని వేలాది వ్యాపారాలకు నష్టం జరుగుతుందని, దీనికి వ్యతిరేకంగా అప్పీల్ చేస్తామని ప్రకటించింది. గతంలో అమెరికాలోని ఫెడరల్ న్యాయస్థానం, వినియోగదారుల గోప్యతను ఉల్లంఘించినందుకు గూగుల్ నుంచి 425 మిలియన్ డాలర్లు జరిమానా వసూలు చేసింది. అదే రోజు ఫ్రాన్స్ ఇంటర్నెట్ 'కుకీస్' చట్టాన్ని ఉల్లంఘించినందుకు మరో 325 మిలియన్ యూరోల జరిమానా విధించింది. ట్రంప్ ప్రభుత్వం తమ దేశ టెక్ కంపెనీలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలుంటాయని హెచ్చరించినప్పటికీ యూరోపియన్ కమిషన్ భారీ జరిమానా విధించడం గమనార్హం..



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విశాఖ వాసులు, పర్యాటకులు

వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ జిల్లా పర్యాటక శాఖ, వివిధ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎంజిఎం మైదానంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అన్ని రకాల ఆహార పదార్థాలనూ ఇక్కడ అందుబాటులో ఉంచారు. విశాఖ వాసులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వంటకాలను రుచి చూశారు. విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీభరత్ మాట్లాడుతూ పర్యాటక రంగంలో ఓపెన్ పాలసీల ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని, అధిక ఆదాయం వస్తుందని అన్నారు. దానికి తగ్గట్లు ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అజయ్ జైన్ మాట్లాడుతూ వైజాగ్ అంటేనే టూరిజం అని, అందుకే ఈ నగరానికి ముఖ్యమంత్రి అంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇక్కడి పర్యాటకుల అభిరుచికి అనుగుణంగా కొత్తకొత్త హోటళ్లు, రిసార్టులు వస్తున్నాయని వివరించారు. భవిష్యత్తులో విశాఖ కేంద్రంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. క్యాలండర్ కూడా రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిది మెగా ఈవెంట్లు, జిల్లాల్లో 15 చొప్పున ఈవెంట్లు నిర్వహిస్తామని ప్రకటించారు. విశాఖలో త్వరలోనే పార్టనర్స్ సమ్మిట్, 2026లో వైజాగ్ ఉత్సవాలు జరుగుతాయని, అరకు ఉత్సవాలు కూడా ఉంటాయని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇక నుంచి వైజాగ్‌లో ప్రతి నెలా ఒక ఈవెంట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టార్ చెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన హోటల్స్ చెఫ్‌లకు అతిథులు బహుమతులను అందజేశారు. తదుపరి అతిథులంతా ఫుడ్ స్టాళ్లను సందర్శించి వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్ పాల్గొన్నారు.

ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు..!

- యుఎస్ టారిఫ్‌ల వేళ కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ : భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా విధించిన టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. ట్రంప్ టారిఫ్‌లతో ఎగుమతిదారుల్లో తీవ్ర ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే భారత ఎగుమతిదారులకు మద్దతునిచ్చేలా ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టనుందని రిపోర్టులు వస్తోన్నాయి. రష్యా చమురును కొనుగోలు చేస్తోందనే అక్కసుతో భారత్‌పై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లను విధించిన విషయం తెలిసిందే. ఈ అధిక టారిఫ్‌ల వల్ల వస్త్రాలు, జౌళి ఉత్పత్తులు, ఆభరణాలు, రత్నాలు, వ్యవసాయ, మత్స్య సంబంధిత ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోన్న నేపథ్యంలో కేంద్రం ప్రోత్సాహక చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో భాగంగా చిన్న ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న ద్రవ్య పరిమితులను పరిష్కరించాలని కేంద్రం యోచన. అదే విధంగా కంపెనీలపై నిర్వహణ భారం తగ్గించేలా చర్యలు తీసుకోవడంతో పాటుగా ఎగుమతులకు సంబంధించిన రంగాల్లో ఉద్యోగ భద్రతను కల్పించడం, ఎగుమతుల కోసం కొత్త మార్కెట్లను అన్వేషణకు మద్దతునిచ్చేలా కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని సమాచారం. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 20 శాతంగా ఉంది.

ట్రంప్ టారిఫ్‌లపై చర్చించనున్న బ్రిక్స్ సదస్సు

న్యూఢిల్లీ : అమెరికా విధించిన టారిఫ్‌లపై చర్చించేందుకు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా ఏర్పాటు చేసిన బ్రిక్స్ దేశాల వర్చువల్ సదస్సులో భారత్ తరపున విదేశాంగమంత్రి జై శంకర్ పాల్గొంటారు. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. 11దేశాలు గల బ్రిక్స్‌గ్రూపులో ఎన్ని దేశాలు, ఏ స్థాయిలో ఈ సదస్సులో పాల్గొంటున్నాయో ఇంకా బ్రెజిల్ అధికారులు స్పష్టం చేయలేదు. ఆగస్టు 6న అమెరికా టారిఫ్‌లు విధించిన వెంటనే లాలూ ప్రధాని మోడీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ విషయమై ఉమ్మడి ప్రణాళికను రూపొందించేందుకు గానూ బ్రిక్స్ సభ్య దేశాలతో మాట్లాడతానని, వారి మద్దతు కోరతానని చెప్పారు. ఈ సదస్సులో పుతిన్ పాల్గొంటారని శు క్రవారం క్రెమ్లిన్ ప్రతినిధి స్పష్టం చేశారు. సోమవారం (8వ తేదీ) జరిగే ఈ సదస్సుకు నిర్దిష్ట ఎజెండాను ఇంకా బ్రెజిల్ ప్రకటించలేదు. అంతర్జాతీయ వాణిజ్యంపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం, ఏకపక్ష ఆర్థిక చర్యల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గానూ బహుళపక్షవాదాన్ని బలోపేతం చేయడానికి చర్యలు ఎజెండాలో వుంటాయని స్థానిక మీడియా తెలిపింది.

శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి లోయలోకి పడిన బస్సు
- 15 మంది మృతి.. 16 మందికి గాయాలు

కొలంబో : శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దాదాపు 30 మంది ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు కొండపై నుంచి లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణీకులు మృతి చెందారు. 16 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని పోలీసు అధికారి తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసు అధికారి ఫ్రెడ్రిక్ వూట్లర్ తెలిపిన వివరాల ప్రకారం.. "కొలంబోకి తూర్పున 280 కిలోమీటర్ల దూరంలో వెల్లవాయ పట్టణానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోవడంతో 15 మంది ప్రయాణీకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురు చిన్నారులతో సహా 16 మంది గాయాలపాలయ్యారు" అని ఫ్రెడ్రిక్ చెప్పారు. డ్రైవర్ బస్సును అతివేగంతో నడపడంతో అదుపుతప్పి మరొక వాహనాన్ని ఢీకొన్నది. ఆ తర్వాత బస్సు గార్డురెయిల్స్‌ను తాకి కొండపై నుంచి బోల్తాపడి లోయలోకి పడిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వూట్లర్ చెప్పారు. లోయలో పడిన బస్సు పూర్తిగా ధ్వంసమైనట్టు స్థానిక మీడియా ఫుటేజీల్లో కనిపించింది.

ఛత్తీస్‌గఢ్‌లో 14 వేల మంది
ఆరోగ్య సిబ్బంది రాజీనామా

రాయ్‌పూర్ : జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న సిబ్బంది తమ సమస్యల కోసం పోరాడుతుంటే..ఆ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అణిచివేత చర్యలకు పాల్పడింది. ఆందోళనల్లో పాల్గొన్న 25 మంది ఎన్‌ఎహెచ్‌ఎం సిబ్బందిని తొలగించి ఉద్యమాన్ని అణిచేసేందుకు ప్రయత్నించింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది మొత్తం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. 25 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే తాము కూడా విధులకు వచ్చే ప్రసక్తే లేదంటూ దాదాపు 14 వేల మంది పైగా ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అధికారులు, ఉద్యోగులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 18 నుండి ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీరించాలని, పని పరిస్థితులను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు. దీర్ఘకాలంగా నెరవేరని వారి డిమాండ్లను పరిష్కరించడానికి బదులుగా ప్రభుత్వం వారిపై కఠినమైన చర్యలు తీసుకుందని ఛత్తీస్‌గఢ్ ప్రదేశ్ ఎన్‌హెచ్‌ఎం కర్మచారి సంఘ్ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. అందరికీ సమానమైన, అందుబాటులో వుండే,నాణ్యతాపరమైన ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో జాతీయ హెల్త్ మిషన్ ఏర్పాటైంది. ఈ ప్రోగ్రామ్ కింద విస్తృత స్థాయిలో డాక్టర్లు, నర్సులతో పాటూ ఆరోగ్య కార్యకర్తలు పనిచేస్తూంటారు. వీరి సమ్మె వల్ల కీలకమైన పలు విభాగాల ఆరోగ్య సేవలు నిలిచిపోయాయి. టీకాలు వేయడం, నవజాత శిశు సంరక్షణ, ఫిజియోథెరపీ, జనన, మరణ ధృవీకరణపత్రాల జారీ, టిబి మందుల పంపిణీ ఇలాంటివన్నీ స్తంభించాయని అధికారులు తెలిపారు.

ఉద్యమ అణచివేత చర్యలకు నిరసన



ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో పెరియార్ చిత్రపటం


- ఆవిష్కరించిన ఎంకె స్టాలిన్

లండన్ : ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కీర్తిశేషులు, సంఘ సంస్కర్త 'పెరియార్' ఇ.వి. రామసామి చిత్రపటం స్ఫూర్తి నింపనుంది. ఈ చిత్రాన్ని బ్రిటన్ పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గురువారం నాడు ఆవిష్కరించారు. పెరియార్ చిత్ర పటాన్ని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించడం తనకెంతో గర్వకారణమని స్టాలిన్ అన్నారు. పెరియార్ స్ఫూర్తితో అన్ని దేశాల్లో అణగారిన ప్రజలకు రిజర్వేషన్లు కల్పించి..తద్వార సమాజ పురోభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా స్టాలిన్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల కల్పన ద్వారా అణగారిన ప్రజల హక్కులను పరిరక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక సేవా సంస్థలు ఈ దిశగా హక్కుల సాధనకు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించిన 'ది కేంబ్రిడ్జ్ కాంపానియన్ టు పెరియార్' అనే పుస్తకాన్ని కూడా ఈ సందర్భంగా స్టాలిన్ ఆవిష్కరించారు. పెరియార్ రచనలను అనువదించడానికి తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం మాదిరిగానే, ఇతర విశ్వవిద్యాలయాలు కూడా వాటిని ప్రచురించాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. పెరియార్ ఆలోచనలు ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికి చేరాలని, ప్రస్తుతం ఉన్న అన్ని రకాల అణచివేతలను తొలగించాలని ఆయన కోరారు. ఉమ్మడి పౌర హక్కుల నుండి వ్యక్తిగత హక్కుల వరకు, అన్ని హక్కులను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు ఆత్మగౌరవ భావన మాత్రమే ప్రపంచ ప్రజలను వసుధైక కుటుంబంలో తోబుట్టువులుగా చేయగలదని చెప్పిన పెరియార్ మాటలను స్టాలిన్ ఉటంకించారు. ఆత్మగౌరవ ఉద్యమం విజయాన్ని ప్రతిబింబించే ఇలాంటి సమావేశాలు ఆత్మగౌరవ ఆదర్శాన్ని నిలబెట్టగలవన్నారు.


ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న స్టాలిన్

ఉమర్ ఖలీద్‌కు అన్యాయంపై సుప్రీంను ఆశ్రయిస్తాం

- కపిల్ సిబల్ వెల్లడి



న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. రాజకీయంగా తమకు హాని కలుగుతుందని భావించి, ఇలాంటి అంశాలను రాజకీయ పార్టీలు లేవనెత్తనపుడు, భారతదేశ ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రశ్నించారు. ఖలీద్ తరపు న్యాయవాది ఏడుసార్లు వాయిదాలు కోరారని మాజీ సిజెఐ డి.వై.చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఈ అంశం సుప్రీం ముందున్నపుడు కేవలం రెండుసార్లే వాయిదా కోరారని చెప్పారు. "ఏళ్ళ తరబడి కోర్టు తీర్పు ఇవ్వకపోతే, అందుకు లాయర్లను నిందిస్తున్నారు. ఇది కోర్టుల్లోని పరిస్థితి. మీరు బెయిల్ ఇవ్వాలనుకోకపోతే వెంటనే తిరస్కరించండి, ఎందుకు 20, 30సార్లు విచారణలు జరుపుతారు?" అని సిబల్ ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ప్రశ్నించారు.

టెక్ దిగ్గజాలకు ట్రంప్ 'విందు' బెదిరింపులు

- అమెరికాలో మీ పెట్టుబడులు ఎంత? అంటూ నిలదీత
- శ్వేతసౌధంలో అధ్యక్షుడి విందుకు దిగ్గజాల హాజరు
- టెస్లా అధినేత ఎలన్ మస్క్‌కు అందని ఆహ్వానం


ట్రంప్ దంపతులు ఇచ్చిన విందుకు హాజరైన టెక్ దిగ్గజాలు టిమ్ కుక్, సుందర్ పిచయ్, జుకెర్ బర్గ్, బిల్‌గేట్స్ తదితరులు

వాషింగ్టన్: అమెరికాలో పెట్టుబడులే లక్ష్యంగా పలువురు టెక్ దిగ్గజాలకు ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సిఇఓలు హాజరయ్యారు. అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం ఈ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిమ్‌కుక్, సుందర్ పిచాయ్, మార్క్ జుకర్‌బర్గ్, సత్యానాదెళ్ల వంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. అయితే ట్రంప్ ఒకప్పటి మిత్రుడు, టెస్లా అధినేతకు మాత్రం ఆహ్వానం అందకపోవటం గమనార్హం. తనకు ఆహ్వానం అందిందనీ, తాను మాత్రం ఈ విందుకు హాజరు కాలేకపోయానని మస్క్ వివరణ ఇచ్చారు. విందుకు పిలిచినట్టే పిలిచి అస్సలు అమెరికాలో మీరు పెట్టిన పెట్టుబడులు ఎంత అంటూ టెక్ దిగ్గజాలను ట్రంప్ నిలదీశారు. ఇతర దేశాల్లో పెట్టిన పెట్టుబడులు ఇక చాలించాలని, స్వదేశానికి తిరిగి రావాలని ఆయన తనదైన శైలిలో బెదిరించినట్లు సమాచారం.

'టిమ్.. అమెరికాలో యాపిల్ ఎంత పెట్టుబడులు పెట్టనుంది. అది చాలా పెద్ద మొత్తమే అయి ఉంటుందని నాకు తెలుసు. ఇన్నాళ్లూ మీరు బయట (ఇతర దేశాల్లో) పెట్టుబడులు పెట్టింది చాలు. ఇక స్వదేశానికి తిరిగిరండి. ఎంత పెట్టుబడి పెడతారు?" అని యాపిల్ సిఇఒ టిమ్ కుక్‌ను ట్రంప్ అడిగారు. దీనికి టిమ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' అని చెప్పారు. భారత్‌లో యాపిల్ కార్యకలాపాలు నిలిపివేయాలంటూ గత కొంత కాలంగా ఆ సంస్థపై ట్రంప్ ఒత్తిడి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే భారత్‌ను టార్గెట్‌గా చేసుకొనే విదేశాల్లో పెట్టుబడులు ఆపేయాలని ట్రంప్.. టిమ్‌ను ప్రశ్నించినట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

ఇక ట్రంప్ అడిగిన ఇదే ప్రశ్నకు మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' ఇన్వెస్ట్ చేయనున్నట్టు చెప్పారు. రాబోయే రెండేండ్లలో 250 బిలియన్ డాలర్లు అమెరికాలో పెట్టుబడులు పెట్టబోతున్నామని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ తెలిపారు. ఏటా 80 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడతామని మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్యానాదెళ్ల బదులిచ్చారు. టెక్ దిగ్గజాల సమాధానాలకు ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులు చాలా పెద్ద మొత్తమనీ, వీటితో పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టించొచ్చని వారిని అమెరికా అధ్యక్షుడు అభినందించారు.

మస్క్‌కు మళ్లీ షాకిచ్చిన ట్రంప్

ఈ విందుకు టెస్లా అధినేత, ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్‌కు ఆహ్వానం అందకపోవడం చర్చనీయాంశమైంది. అధ్యక్ష ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కొంతకాలం పాటు ట్రంప్ వెంటే నడిచిన మస్క్.. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో బహిరంగంగానే పరస్పర విమర్శలు చేసుకున్న విషయం విదితమే. ఇద్దరి మధ్య సంబంధాలు చెడిన కారణంగానే తాజాగా టెస్లా అధినేతను అధ్యక్షుడు ఆహ్వానించలేదనే చర్చలు నడుస్తున్నాయి. అయితే తనకు ఆహ్వానం అందిందనీ, తాను మాత్రం హాజరు కాలేకపోయానని మస్క్ చెప్పటం కొసమెరుపు. మస్క్‌కు నిజంగానే ఆహ్వానం అందిందా లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉన్నది.

సైన్యానికి అణు యుద్ధ నౌకలు

- లేజర్, ఎఐ ఆయుధాలు కూడా
- 15 ఏళ్లలో సమకూర్చుకునేలా రోడ్‌మ్యాప్

న్యూఢిల్లీ : త్రివిధ దళాలకు అత్యాధునిక ఆయుధాలు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అణు శక్తి నడిచే యుద్ధ నౌకలు, లేజర్, కృత్రిమ మేధ (ఎఐ)తో పని చేసే ఆయుధాలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ వంటి అధునాతన ఆయుధ సంపత్తిని 15 ఏళ్ల కాల పరిమితిలో సమకూర్చుకునేలా ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు విడుదల చేసింది. జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి, 'ఆపరేషన్ సిందూర్' వంటి పరిణామాల నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు నిర్ణయించింది. సమకూర్చుకోవాల్సిన ఆయుధాల జాబితాలో అణుశక్తి యుద్ధ నౌకలు, మలితరం యుద్ధ ట్యాంకులు, హైపర్‌సోనిక్ క్షిపణులు, స్టీల్త్ బాంబర్ డ్రోన్లు, ఎఐ ఆధారిత ఆయుధాలు ఉన్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.వేల కోట్లను వెచ్చించాల్సివుంటుంది.

ఇదే రోడ్ మ్యాప్

త్రివిధ దళాలకు కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను సమకూర్చాలని ఈ విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం పాత టి-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనుంది. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనుంది. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50 వేల యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్, 6లక్షల శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితోపాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఇడి సిస్టమ్‌లను రంగంలోని దించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నౌకాదళం కోసం సరికొత్త ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్, 10 అత్యాధునిక ఫ్రిగెట్‌లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫారమ్స్, హెలికాప్టర్లు కొనుగోలు చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌ను సేకరించేందుకు పచ్చజెండా ఊపింది.



వాయుసేన కోసం..

వాయుసేన కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్స్, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, 100 రిమోట్ సాయంతో పనిచేసే విమానాలు, గైడెడ్ ఆయుధాలు, 20 స్ట్రాటోస్ఫియరిక్ ఎయిర్ షిప్‌లను సమకూర్చనుంది. 21 శతాబ్దంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఈ దిశలో యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, మానవ రహిత విమానాల కోసం గగనతలం నుంచి భూతలంపైకి సంధించే క్షిపణులు, అత్యాధునిక టార్గెటింగ్ పాడ్స్ వంటివి కూడా కేంద్రం నిర్దేశించుకున్న జాబితాలో ఉంయి. ఇదే సమయంలో ఆయుధాలను పెద్దఎత్తున అభివద్ధి చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీని వాడతామని రక్షణ శాఖ పేర్కొంది. రోబోటిక్స్, కత్రిమ మేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుద్ధ భూములను మార్చేస్తున్నాయని అభిప్రాయపడింది. ఆ మేరకు సన్నద్ధంకావాలని పేర్కొంది. దేశీయ కంపెనీలు మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని రక్షణశాఖ కోరింది.

మరిన్ని ఎస్-400 కొనుగోళ్లు ..

గగనతల రక్షణ వ్యవస్థల్లో ప్రఖ్యాతినొందిన ఎస్-400 వ్యవస్థలను మరికొన్ని సమకూర్చుకోవటంపైనా రక్షణ శాఖ దష్టి సారించింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్-400 అద్భుతంగా పనిచేసినట్లు వాయుసేన పేర్కొనటంతో మరికొన్ని యూనిట్లు కొనుగోలు చేసేందుకు రక్షణ శాఖ సిద్ధమైంది. ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ప్రత్యర్థి క్షిపణులను అడ్డుకోవటమే కాకుండా వాటిని ధ్వంసం చేసే సామర్థ్యం కలిగి ఉంది.

పెట్టుబడుల రాకకు కేంద్రం మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక వద్ధికి ఇదొక మలుపుగా నిలుస్తుందని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, అభివృద్ధి కార్యాక్రమాలను చేపట్టేందుకు కేంద్రం నిరంతర సహకారాన్ని, మార్గదర్శకాన్ని అందించాలని ప్రధానిని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ రంగాల్లో పురోగతిని ప్రధానికి లోకేష్ తెలియజేశారు. ప్రధానంగా రాష్ట్ర విద్యా ప్రమాణాల మెరుగుదలకు అనేక సంస్కరణలు అమల్జేస్తున్నామని తెలిపారు.ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం, మార్గదర్శనం కావాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15 నెలలుగా కేంద్ర సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. 'వికసిత్ భారత్ - 2047'లో ఆంధ్రప్రదేశ్ భాగస్వామి అవుతుందన్నారు. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) 2.0 సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ ఉపశమనం కలిగించారని, ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు అని లోకేష్ అన్నారు. జిఎస్‌టి సంస్కరణలు ఎంఎస్‌ఎంఇలు, చిన్న వ్యాపారాలకు మరింత ఊతమిస్తాయన్నారు. లోకేష్ అభ్యర్థనలపై ప్రధాని మోడీ స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న ప్రొ. జె విజయలక్ష్మి

ఆరుగురు తెలుగువారికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

- రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వినూత్న పద్ధతిలో బోధనతో విద్యార్థులకు సులభతరంగా పాఠాలు చెప్పడంతో పాటు వారిలో చదువుపై మక్కువ పెంచుతున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు దక్కాయి. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు ఈ పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పాఠశాల విద్యా విభాగంలో విశాఖపట్నంలోని పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (17వ వార్డు) ఉపాధ్యాయురాలు మాధబత్తుల తిరుమల శ్రీదేవి, ఉన్నత విద్యా విభాగంలో ప్రొఫెసర్ జె విజయలక్ష్మి (స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), మెండ దేవానంద కుమార్ (లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం) పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణ నుంచి కూడా ముగుర్గు ఉపాధ్యాయులకు పురస్కారాలు లభించాయి. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యా విభాగంలో 45 మందికి, ఉన్నత విద్యా విభాగంలో 21 మంది ఉపాధ్యాయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యయ పురస్కారాలను రాష్ట్రపతి అందజేశారు.

సమ్మెలోని కార్మికులకు బోయింగ్ బెదిరింపులు

- కొత్తవారిని నియమిస్తామంటూ ప్రకటనలు



సెయింట్ లూయిస్ : అమెరికాలోని ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ పరిశ్రమలో కార్మికులు తమ సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు. గత నెల 4న సమ్మె మొదలైనప్పటి నుంచి బోయింగ్ వివిధ రూపాల్లో బెదిరింపులకు దిగుతోంది. శ్రమజీవులు మాత్రం తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదంటూ పోరుపంథా కొనసాగిస్తున్నారు. దీంతో సమ్మెలో ఉన్న కార్మికులందరినీ తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటామని బోయింగ్ సంస్థ గురువారం ప్రకటించింది. ఈ నెల 16 నుండే కొత్త వారిని నియమిస్తామని బెదిరించింది.

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మెషినిస్ట్స్ అండ్ ఏరోస్పేస్ వర్కర్స్ డిస్ట్రిక్ట్-837 (ఐఎఎం) సంఘం నేతృత్వంలో 3500 మంది కార్మికులు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత , ఆరోగ్య సంరక్షణ తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. అయితే బోయింగ్ యాజమాన్యం కార్మికుల డిమాండ్లను అంగీకరించకుండా ఏకపక్షంగా నాలుగేళ్ల ఒప్పందాన్ని ప్రకటించింది. దీన్ని ఓటింగ్ ద్వారా కార్మికులు తిరస్కరించారు. తమ నైపుణ్యాన్ని , దేశ రక్షణలో తమ శ్రమను గుర్తించాలని వారు కోరుతున్నారు. ఈ సమ్మెతో అమెరికా రక్షణ వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎఫ్-15 యుద్ధ విమానాలు, టి-7ఎ, ఎఫ్/ఎ-16, ఎంక్యూ-25 డ్రోన్ రిఫ్యూలింగ్ వంటి అధునిక ఆయుధాలు, యుద్ధ విమానాల ఉత్పత్తి నిలిచిపోయింది. మరోవైపు బోయింగ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాన్ గిలియన్ మాట్లాడుతూ, యూనియన్ చర్చల్లో పురోగతి లేదని, కష్టమర్ల అవసరాలను తీర్చడానికి సిబ్బంది అవసరమని, సమ్మె సమయంలోనూ ఫ్యాక్టరీలు తెరిచి ఉన్నాయని, సమ్మె చేయని ఉద్యోగులు పని చేస్తున్నారని, బోయింగ్ డిఫెన్స్ యూనిట్ గత ఏడాది 23 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించిందన్నారు. కొత్తవారిని నియమించేందకు సెప్టెంబర్ 16న జాబ్ మేళా ఉంటుందని, ఇవి తాత్కాలికమైనవి కాదు సమ్మె చేస్తున్న కార్మికుల స్థానాల్లో శాశ్వతంగా నియమిస్తామని, కంపెనీ తన ప్రతిపాదనలను మార్చడానికి సిద్ధంగా ఉంది, కానీ ఆర్థిక అవసరాలకు అనుగుణంగానే మార్పులు చేస్తామని తెలిపారు. మరోవైపు యూనియన్ అంతర్జాతీయ అధ్యక్షుడు బ్రియాన్ బ్రయాంట్ బోయింగ్‌ను తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికే కంపెనీ చాలా ఆడర్లు రద్దు చేసుకుందని, అనుభవజ్ఞులైన కార్మికులను విశ్వాసంలోకి తీసుకోకుండా కొత్తవారిని తీసుకుంటామని యాజమాన్యం రెచ్చగొడుతుందని విమర్శించారు., 5 వేల డాలర్ల సైనింగ్ బోనస్‌ను తొలగించడం సరికాదన్నారు..కార్మికుల డిమాండ్లు అంగీకరించేందకు యాజమాన్యం అనేక సాకులు చెబుతుందని. ఈ ఏడాది రెండో త్రైమాసంలో నష్టాలు కూడా తగ్గాయని, తమ డిమాండ్లు యాజమాన్యం అంగీకరించే వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు జారీ

ముంబయి : బాలీవుడ్ నటి శిల్పాశెట్టితో పాటు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 60 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి సంబంధించిన చీటింగ్ కేసులో ముంబయి పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం వారిపై శుక్రవారం నాడు లుకౌట్ నోటీసులు జారీ చేసింది. శిల్పాశెట్టి దంపతులు తరచూ అంతర్జాతీయ పర్యటనలు చేపడుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. రూ.60 కోట్ల రుణం, పెట్టుబడులకు సంబంధించి ఆర్థిక ఒప్పందం చేసుకున్న ఒక వ్యాపారవేత్తను శిల్పా దంపతులు మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. నిందితులు దేశం విడిచివెళ్లకుండా వారిపై నిఘా ఉంచడం కోసం లుకౌట్ నోటీసులు జారీ చేస్తారు. ఫలితంగా ఇమ్మిగ్రేషన్, సరిహద్దు నియంత్రణ పాయింట్ల వద్ద అధికారులు నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుంది.

ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్యం

(మొదటిపేజీ తరువాయి)

సేవ చేయవని, ఇప్పటికే పంటల బీమా పథకానికి ప్రయివేటు కంపెనీలకు అప్పగించడం రైతులకు ఎంత చేటు తెచ్చిందో అనుభవమే తెలుపుతోందని పేర్కొన్నారు. రాజ్యాంగ హామీగా ప్రజలకు ఇచ్చినటువంటి వైద్య సేవలను కూడా ప్రైవేటు వ్యాపారానికి అప్పజెప్పడం మానవహక్కుల ఉల్లంఘనే అవుతుందని వివరించారు. ప్రభుత్వమే విద్య, వైద్య ఆరోగ్య రంగాన్ని అభివద్ధి చేసి నిర్వహించాలని, ఆరోగ్య సేవలనూ ప్రభుత్వమే అందించే విధంగా వైద్యశాలను అభివద్ధి చేయాలని, వైద్యరంగంలో పి3 పేరుతో ప్రైవేటుపరం చేయడం, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయాన్ని వెనక్కుతీసుకోవాలని డిమాండు చేశారు.

పత్తి కొనుగోళ్ల నుంచి వైదొలగనున్న సిసిఐ!

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. మిర్చి, ఆయిల్‌పాం, మొన్న చిత్తూరులో మామిడి కాయలకు అమలైన విధానం. కాగా ఎంఎస్‌పి ప్రకటించే జాబితాలో పత్తి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌నకు క్వింటా పత్తి కాయలకు రకాల వారీగా గరిష్ఠంగా రూ.8,110 ప్రకటించారు కూడా. అంతకంటే తక్కువ మార్కెట్‌లో ధర ఉన్నట్లయితే మార్కెట్ ధరకు, ఎంఎస్‌పికి మధ్య వ్యత్యాసాన్ని రైతుకు చెల్లిస్తారు.

ఇటువంటిది కావాలని బడ్జెట్ కసరత్తుకు ముందు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రి (సిఐటిఐ) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీన్నిబట్టే డిబిటి అనేది

రైతులకు కాదు కార్పొరేట్ల కోసమని అర్థమవుతుంది. డిబిటి అమలైన పంటల విషయంలో ఇప్పటికే ఇది రుజువైంది. ఆంధ్రప్రదేశ్‌లో పత్తి గణనీయమైన విస్తీర్ణంలో సాగవుతోంది. పత్తి విరివిగా పండే ప్రాంతాల్లోనే రైతుల, కౌలు రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది 10-15 లక్షల ఎకరాల్లో పత్తిని వేస్తున్నారు. ఉత్పత్తి 8 లక్షల బేళ్లుగా నమోదవుతోంది. లక్షల మంది రైతులకు సంబంధించిన అంశం కావడం, త్వరలో ఖరీఫ్ మార్కెట్ ప్రారంభమవుతున్న తరుణంలో డిబిటి వార్తలు రైతులను కలవర పెడుతున్నాయి.

జీవన సౌరభం

ఫలితాన్ని ఆశించి పరుగెత్తవద్దు.. పనిచేస్తూ పోతే ఫలితం అదే వస్తుంది.


మీ కోసం

ఫ్లవర్‌వాజ్‌లో ఉప్పు కలిపిన నీటిని పోస్తే, పూలు ఎక్కువ సమయం వరకు తాజాగా ఉంటాయి.



JEEVANA జీవన the family

చందమామతో ఒక మాట



'ఏంటి మామా.. రోజూ హుషారుగా ఉండేవాడివి. ఈ మధ్య నీరసంగా కన్పిస్తున్నావు' అంటూ చంద్రుడిని ఆప్యాయంగా పలుకరించే ప్రయత్నం చేసింది సమీరం.

'ఏమీ లేదు. ఏదో గ్రహణం అని రెండు మూడు రోజుల నుంచి అందరూ హడావిడి చేస్తున్నారు. ఆ రోజు నా వైపు ఎవరూ చూడరట' అంది చందమామ.

'నిజమే.. నేనూ విన్నాను. ఇంతకీ నిన్ను నేను కూడా చూడకూడదా మామా?' అని అడిగింది అమాయకంగా సమీరం.

'అదేమీ లేదు. అదంతా ఒట్టి మూఢ నమ్మకం. నేను భూమికి ఉప గ్రహాన్ని అని తెలుసు కదా. నాకు సూర్యునికి మధ్యగా భూమి వచ్చినపుడు, సూర్యుని కాంతి నాపై పడకుండా భూమి అడ్డుపడటంతో భూమిపై ఉన్నవారికి నేను కనిపించను. దీన్ని చంద్ర గ్రహణం అని మనుషులు పిలుస్తున్నారు. ఇది ఎప్పుడూ పౌర్ణమి నాడు జరిగేదే' అని వివరంగా చెప్పింది చందమామ.

'అదేంటి మరి! నిన్ను ఆ రోజు గర్భిణీలు చూస్తే పుట్టే పిల్లలకు గ్రహణం మొర్రి వస్తుందని విన్నాను. నిజమేనా?' అని ఈసారి మరింత అనుమానంగా అడిగింది సమీరం.

'ఇందాకే చెప్పాను కదా! అదంతా మూఢన మ్మకమని. అలాంటిది ఏమీ లేదని శాస్త్రవేత్తలు ఎప్పుడూ చెబుతూనే ఉంటారు. జన్యుపరమైన లోపాల వల్ల అలా జరుగుతుందని కూడా తేల్చి చెప్పారు. అయినా కొంతమంది ఇంకా ఆ మూఢ నమ్మకాలనే పట్టి వ్రేలాడుతున్నారు' అని కాస్త దిగాలుగా ముఖం పెట్టి అంది చందమామ.

'నీ గురించి ఇంకా చాలా విన్నా. నీవు సుడులు తిరిగినప్పుడు దెయ్యం వస్తుందని ప్రచారం చేస్తున్నారు. నిజమేనా!' అని అడిగింది సమీరం కాస్త అనుమానంగా ముఖం పెట్టి.

'అది దెయ్యం కాదు, పాడు కాదు. అది ఒట్టి సుడిగాలి. అంతకుమించి ఏమీ లేదు. జనాలు నమ్మినంత కాలం ఇలాంటివి ఎన్నో సృష్టిస్తారు. ఈ ప్రచారాలు చేసేవారు ఎప్పుడు మారతారో ఏంటో..?' అంటూ చందమామ అక్కడి నుండి వెళ్లిపోయింది. అటువైపే చూస్తూ సమీరం కూడా దాని గమ్యానికి చేరుకుంది.

- యం.రాం ప్రదీప్,
జెవివి సభ్యులు, తిరువూరు,
94927 12836.

సరైన అంకెలు వేయండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న గడియారంలో అంకెలు వేయాలి. పక్కనే ఉన్న క్లూ ఆధారంగా రాయండి.



నేను గీసిన బొమ్మ



కోడ వరం
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ముత్యాల పేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పదేళ్లకే ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్!



'పిట్ట కొంచెం కూత ఘనం' అన్న మాట ఈ పదేళ్ల శ్రేయావి మెహతాకి సరిగ్గా సరిపోతుంది. అడుగులు వేయడం నేర్వకముందే కెమెరాని పట్టుకోవడం మొదలుపెట్టిన ఈ చిన్నారి, ఏడేళ్లు వచ్చేసరికి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌లకి ఏమాత్రం తీసిపోని రీతిలో ఫొటోలు తీసింది. వన్యప్రాణుల ఫొటోగ్రాఫర్లు అయిన తల్లీదండ్రీ కప్నా, శివాంగ్‌ల ప్రోత్సాహంతో ప్రపంచ రికార్డులని కూడా కొల్లగొడుతోంది.



సూర్యోదయానికి కంటే ముందే ప్రకృతిలో గడపడం శ్రేయావికి ఎంతో ఇష్టం. అక్కడ కనిపించిన ప్రతి దృశ్యం తన కెమెరాలో బంధించడం తన అభిరుచి. అలా శ్రేయావి తీసిన ప్రతి ఫొటో ఒక అద్భుతం. చెట్ల ఆకుల మధ్య అల్లుకున్న సాలీడు గూడు ఎంత అందంగా ఉంటుందో ఆమె తీసిన ఫొటో చెబుతుంది. నిండుగా నిండిన చెరువు తెప్పపై మోడైన చెట్టుపై వాలిన పక్షులు నీటిలోనూ, చెట్టుపై ఒకేసారి కనిపించే తీరుని తను బంధించిన విధానం చూస్తే ఆశ్చర్యపోకమానం. సూర్యాస్తమయం వేళ గూడుకు చేరుకున్న పక్షులు, కోతులు, నీటిపై చేపలను వేటాడే కొంగలు, గాండ్రిస్తూ వస్తున్న పులి.. ఇలా ఎన్నో వన్యప్రాణుల జీవన దృశ్యాలు శ్రేయావి కెమెరాలో ఎంతో అందంగా ఇమిడిపోయాయి.

పిల్లలను నిద్రపుచ్చేందుకు రాత్రిపూట తల్లిదండ్రులు పిట్టకథలు చెబుతుంటారు. శ్రేయావి ఆ అవసరం లేకుండా పెరిగింది. అమ్మానాన్నతో పాటు నెలల వయసు నుండే జాతీయపార్కుల్లో తిరిగిన అనుభవం ఆమె సొంతం. అక్కడి వన్యప్రాణులతో పాటు పెరిగింది. అవి ఉన్న చోటునే ఫొటో తీసేందుకు నాన్న శివాంగ్ వాటి నివాసాల్లో ఎలా వేచి ఉంటాడో కళ్లారా చూసింది. అలా ప్రతి రోజూ అడవి, అందులో ఉండే వన్య పాణులు తనకో కథ చెప్పాయి.

ఏడాదిలో 300 రోజులు అమ్మానాన్నతో జాతీయ పార్కుల్లో గడిపిన శ్రేయావికి నాన్న కెమెరాలో బంధించిన ఫొటోలు భలే గమ్మత్తుగా అనిపించేవి. కెమెరాని పట్టుకుని నాన్నని అనుకరిస్తూ దూరంగా ఉన్న దృశ్యాలని చూడడం సరదాగా ఉండేది. ఆ ఆసక్తిని గమనించిన శివాంగ్, ఫొటోలు తీయడంలో తనని నేర్పరి చేశాడు. ప్రముఖ ఫొటోగ్రాఫర్లతో కలిసి ప్రయాణించేటప్పుడు తనతో పాటు శ్రేయావిని కూడా పార్కులకి తీసుకెళ్లేవాడు.

'వైల్డ్ లైఫ్ టూరిజం కంపెనీ' పేరుతో ప్రకృతి ప్రేమికులని ఒక్క చోటకి చేర్చిన శివాంగ్ ఫరిదాబాద్ నివాసి. తన బృందంతో కలిసి వన్యప్రాణులను కెమెరాల్లో బంధించడం ఆయన అభిరుచి. అలా ఆ బృందం జాతీయపార్కుల్లో సంచరిస్తూ ఎన్నో జంతువులు, పక్షుల అద్భుత దృశ్యాలను ఫొటో ఫ్రేముల్లో భద్రపరిచారు. ఈ ప్రయాణంలో తన కూతురిలో దాగున్న నైపుణ్యాన్ని శివాంగ్ త్వరగానే గ్రహించారు. అందుకే శ్రేయావిని తను వెళ్లిన ప్రతిచోటుకి తీసుకెళ్లారు. అలా నాలుగేళ్లకే భరత్‌పూర్ నుండి మసాయ్ మారా వరకు శ్రేయావి ప్రయాణించింది. ఎన్నో పక్షులు, జంతువులను తన చిట్టి చేతుల్తో ఫొటోలు తీసింది.

తన చుట్టూ ఉన్న ప్రముఖ ఫొటోగ్రాఫర్లతో పాటు నైపుణ్యం సాధించేందుకు తెల్లవారుజామున 4:30కే మేల్కొని తండ్రి దగ్గర నైపుణ్యాలు నేర్చుకునేది. స్కూలు సమయానికంటే ముందే లేచి తన అభిరుచిపై ఇంతలా శ్రద్ధ పెట్టే సమయానికి శ్రేయావి వయసు కేవలం నాలుగేళ్లే.

ఆరేళ్ల వచ్చేసరికి ప్రొఫెషనల్ కెమెరాలో ఫొటోలు తీసేంతలా నైపుణ్యం సాధించింది. 10 ఏళ్లు వచ్చేసరికి 10 జాతీయ పార్కులు సందర్శించింది. ఏడాదిలో 30 నుండి 40 రోజులు వైల్డ్ సఫారీలు చేస్తుంది. 'ఈ ప్రయాణం చాలా కష్టమైనది. కొన్నిసార్లు కిలోమీటర్ల కొద్దీ కాలినడకనే వెళ్లాల్సి వుంటుంది. అయినా శ్రేయావి వెనదిరిగేది కాద'ని శివాంగ్ ఎంతో గర్వంగా చెబుతారు. శ్రేయావి కెమెరాలో బంధించిన ఫొటోలు గతేడాది 'నేచురల్ హిస్టరీ మ్యూజియం'లో ప్రదర్శితమయ్యాయి. అందులో తను తీసిన నెమళ్ల ఫొటోకి అవార్డు కూడా వచ్చింది. సూర్యాస్తమయం వేళ రెండు మగ నెమళ్లు ఒకదానికొకటి వ్యతిరేకదిశలో నిల్చుని ఉన్నాయి. చుట్టూ దట్టమైన అడవి. సూర్యకాంతి పడి అక్కడి చెట్ల నీడ తెరలు తెరలుగా కనిపిస్తోంది. శ్రేయావికి ఆ దృశ్యం అబ్బురమనిపించింది. అంతే తన కెమెరాలో ఆ అద్భుత దృశ్యాన్ని బంధించింది. ఆ ఫొటో ఎంత అందంగా వచ్చిందంటే, నెమళ్లు, సూర్యకాంతి, చెట్ల నీడలు చాలా స్పష్టంగా వేటికవే బొమ్మ గీసినట్లు ఉన్నాయి. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్లకి కూడా ఆ దృశ్యం వచ్చిన తీరు చూసి ఎంతో ఆశ్చర్యమేసింది. బుల్లి శ్రేయావి సాధించిన ఘనత అది.











కొత్త షెడ్యూల్ మొదలైంది!

అనిల్ రావిపూడి– చిరంజీవి కాంబో మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, కొత్త షెడ్యూల్ సెప్టెంబర్ 19 వరకు జరగనుంది. ఈ షెడ్యూల్‌లో రెండు పాటలు చిత్రీకరణ జరగనున్నాయి. ఇప్పటికే కేరళలో కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమాలో వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సినిమాకి పిల్లలు రావొద్దు!

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'కిష్కింధపురి'. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకు కౌశిక్ పెగళ్ళపాటి దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కాబోతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఎటువంటి కట్స్ లేకుండా 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. దీంతో ఈ సినిమాకు పిల్లలకు అనుమతి లేదని తెలిపిన చిత్రబృందం.. పిల్లలు, గుండె ధైర్యం లేని వారు ఈ సినిమాకు రావొద్దని సోషల్ మీడియాలో ఓ ప్రకటన చేసింది.



ఇక కామెడీ సినిమాల్లోనే ...



బాలీవుడ్ నటి అలియా భట్, తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాల విషయంలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 'నేను ఇప్పటివరకు నా కూతురు రాహా ఎంజాయ్ చేసే సినిమాలు చేయలేదు. అందుకే ఇక నుంచి కామెడీ కథలను ఎంచుకోవాలనుకుంటున్నాను. నా కూతురు నా సినిమాలు చూసి నవ్వుకునేలా సినిమాటిక్ ప్రపంచాన్ని సృష్టించాలనుకుంటున్నాను. ఇక నుంచి హాస్యానికే ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్నా. విభిన్న పాత్రల కోసం ఇప్పటికే కొన్ని ప్రాజెక్ట్స్ సైన్ చేశాను. అయితే వాటిల్లో నటిస్తానా, తప్పుకుంటానా అనేది ఇప్పుడే పూర్తిగా చెప్పలేను. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాను. కామెడీ చిత్రాలతో వచ్చి నా కూతురితో పాటు మీ అందరినీ అలరిస్తాను' అని చెప్పారు.


కాదంబరి కిరణ్ ఆర్థిక సహాయం



సినీ నటుడు, మనం సైతం నిర్వాహకులు కాదంబరి కిరణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. వెంకీ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడు రామచంద్ర. అతడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ మనం సైతం సంస్థ ద్వారా దశాబ్దకాలంగా అనేకమంది అవసరార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'నిన్ను చూడాలని' చిత్రంతో రామచంద్ర నటుడిగా ఎంట్రీ ఇచ్చాడు. వెంకీ సినిమాలో రవితేజ స్నేహితుడిగా నటించి ఆకట్టుకున్నాడు. ఆనందం, సొంతం, దుబాయి శీను, కింగ్, లౌక్యం వంటి పలు చిత్రాల్లో కథానాయకుడి స్నేహితుడి పాత్రల్లో నటించి అలరించాడు. ఇటీవల పక్షవాతం రావడంతో సినీరంగానికి దూరమై మంచానికే పరిమితమయ్యాడు.

డబ్బింగ్‌లో 'చౌదరి గారి అమ్మాయి'

వినయ్ తేజ్, రిషిత జంటగా తెరకెక్కిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి'. ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ దీనిని నిర్మించింది. ఇటీవల షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయి. దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని ఈ సినిమాను తెరకెక్కించారు. 'సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమాను తెరకెక్కించాం. మనం ఎవ్వరికైనా మంచి చేయకపోయినా ఫర్వాలేదు కానీ చెడు చేయకూడదు. సమాజంలో ఉన్నాం కాబట్టి మానవత్వంతో ఉండాలి. అలాంటి మానవీయ విలువల పరిమళమే మా సినిమా 'చౌదరిగారి అమ్మాయి'. ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందనే నమ్మకం నాకుంది' అని దర్శకుడు సిద్ధార్థ వర్మ కాకాని అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆదిత్య ప్రదీప్, డిఒపి మహేష్‌రెడ్డి వ్యవహరించారు. డబ్బింగ్ పనులను చిత్ర యూనిట్ ప్రారంభించింది. పలువురు క్యారెక్టర్ ఆర్టిస్టులు కీలకపాత్రల్లో నటించారు.





భారత్ శుభారంభం

థాయ్‌లాండ్‌పై 11-0తో గెలుపు • ఆసియాకప్ మహిళల హాకీ

హాంగ్జు(చైనా): ఆసియాకప్ మహిళల హాకీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పూల్–బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 11–0తో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసింది. ఉదిత దుహాన్, బ్యూటీ డంగ్ డంగ్ రెండేసి గోల్స్‌తో సత్తా చాటారు. ఉదిత 30, 52వ ని.లో గోల్స్ చేయగా.. బ్యూటీ 45, 54వ ని.లో గోల్స్ చేశారు. ముంతాజ్(7వ ని.), సంగీత(10వ ని.), నవ్‌నీత్ కౌర్(16వ ని.), లాల్‌రిమిసిమి(18వ ని.), సుమన్ దేవి(49వ ని.), షర్మిల(57వ ని.), రుతుజ ధండోస్(60వ ని.) ఒక్కో గోల్స్ కొట్టారు. ఎఫ్‌ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 9వ స్థానంలో, థాయ్‌లాండ్ 30వ స్థానాల్లో ఉన్నాయి. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత్ 5–0 ఆధిక్యతలో నిలిచింది. మొత్తం 8జట్ల మధ్య జరిగే ఈ టోర్నీలో ప్రతి గ్రూప్‌లో టాప్–2 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్–4లో ఆడనున్నాయి. అనంతరం టాప్–2 ఉన్న జట్ల మధ్య సెప్టెంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వెటరన్ గోల్ కీపర్ సవిత పూనియా, డ్రగ్ ఫ్లికర్ దీపిక లేకుండానే ఈ టోర్నీ బరిలో భారత్ ప్రాతినిధ్యం వహిస్తోంది. టోర్నీ విజేతగా నిలిచిన జట్టు నెదర్లాండ్స్–బెల్జియం వేదికగా జరిగే 2026 మహిళల ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. శనివారం రెండో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్, 8న సింగపూర్‌తో తలపడనుంది.

ఎదురులేని యు ముంబ

• బెంగళూరు బుల్స్‌పై ఘన విజయం
• ప్రొ కబడ్డీ సీజన్–12




విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్–12 యు ముంబ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో యు ముంబ జట్టు 48–28 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై ఘన విజయం సాధించింది. ముంబ జట్టు రైడ్‌ల ద్వారా 23, ట్యాకిల్స్ ద్వారా 15పాయింట్లు సాధించడంతోపాటు 6సార్లు బెంగళూరు బుల్స్ జట్టును ఆలౌట్ చేసింది. మరోవైపు బెంగళూరు జట్టు రైడ్‌ల ద్వారా కేవలం 18పాయింట్లు మాత్రమే సాధించినా.. ట్యాకిల్స్‌లో కేవలం 8పాయింట్లు మాత్రమే సాధించి నిరాశపరిచింది. బుల్స్ రైడర్ చవాన్(13)కి తోడు ట్యాకిల్స్‌లో రింకు(5), లోకేశ్, పర్వేజ్ మెరిసారు. ఇక బెంగళూరు జట్టులో ఆశీశ్(6), అలిరేజా(6) మాత్రమే రైడ్స్‌లో రాణించగా.. ఆకాశ్, దీపక్ ట్యాకిల్స్‌లో పట్టు పట్టారు. మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 37–32 పాయింట్ల తేడాతో యుపి యోధాస్‌ను చిత్తుచేసింది.

ప్రొ కబడ్డీలో నేడు..
పట్నా పైరెట్స్ × బెంగళూరు బుల్స్(రాత్రి 8.00గంIIలకు)
తమిళ్ తలైవాస్ × గుజరాత్ జెయింట్స్(రాత్రి 9.00గంIIలకు)

యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు సబలెంక, అనిసిమోవా

నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, టాప్ సీడ్ అర్యానా సబలెంక (బెలారస్), అమండా అనిసిమోవా (అమెరికా) ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడుసెట్ల హోరాహోరీ పోరులో వీరిద్దరూ ప్రత్యర్థులను చిత్తుచేశారు. తొలి సెమీస్‌లో అమెరికాకు చెందిన 8వ సీడ్ అనిసిమోవా 7–6(7–4), 6–7(3–7), 6–3తో 23వ సీడ్, జపాన్‌కు చెందిన నవోమి ఒసాకాను ఓడించింది. రెండో సెమీస్‌లో సబలెంక 4–6, 6–3, 6–4తో 4వ సీడ్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాను చిత్తుచేసింది. శనివారం జరిగే టైటిల్ పోరులో సబలెంక అమెరికాకు చెందిన అనిసిమోవాతో తలపడనుంది. 27ఏళ్ల సబలెంక 2024లో ఈ టైటిల్‌ను తొలిసారి కైవసం చేసుకుంది. వీరిద్దరూ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో తలపడడం ఇదే తొలిసారి. టాప్‌సీడ్ సబలెంక ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కాగా.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌లో ఓటమిపాలైంది. 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను చేజిక్కించుకుంది.



సబలెంక x అనిసిమోవా

ఇక పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ పోరాటానికి సెమీస్‌లో బ్రేక్ పడింది. 14వ సీడ్‌గా బరిలోకి గిన బాంబ్రీ(భారత్)–ఎం. వీనస్(ఆస్ట్రేలియా) జంట శుక్రవారం జరిగి సెమీస్‌లో 7–6(7–2), 6–7(5–7), 4–6తో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 7వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌తో 2వ సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ తలపడనున్నాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెనిక్ సిన్నర్‌తో 25వ సీడ్, అగర్ అలియాస్సిమ్(కెనడా) పోటీపడనున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68